క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
23-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:123

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# బిజెపి బెంగాల్ వ్యూహం!


తెలంగాణ పై బిజెపి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎలాగైనా తెలంగాణలో పాగా వేయాలని గట్టి ఆదేశాలు ఇస్తున్నారు. వై నాట్ తెలంగాణ అన్న సరికొత్త నినాదంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నారు. బెంగాల్ వ్యూహాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. రెండు పొలిటికల్ కన్సల్టెన్సీలకు బాధ్యతలు అప్పగించారు.



### తెలంగాణలో గెలుపు కోసం అస్త్రాలు
### రంగంలోకి ఏబీఎం, జార్విస్ స్ట్రాటజీ టీంలు
### 26న కరీంనగర్ కు అమిత్ షా
### శ్రావణమాసంలో పార్టీలో భారీగా చేరికలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఏబీఎం , జార్విస్ స్ట్రాటజీ టీంలు రంగంలోకి దిగాయి. సంబంధిత సర్వే బృందాలు పార్టీ బలం, బలహీనతలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాయి. ఇకనుంచి బిజెపిలో భారీ స్థాయిలో చేరికలను ప్రోత్సహించాలని కూడా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది.

- మిగతా 2వ పేజీలో



# కట్టడిలో హరీష్!

### ఉమ్మడి మెదక్ జిల్లా కి ట్రబుల్ షూటర్ పరిమితం
### హై కమాండ్ ఎందుకు స్వేచ్ఛ ఇవ్వడం లేదా?
### పార్టీ శ్రేణుల్లో విస్మయం

తెలంగాణ ఉద్యమ సమయం నుంచి పనిచేస్తున్నారు హరీష్ రావు. ఒక విధంగా పార్టీలో కేసీఆర్ తరువాత అంటే హరీష్ రావు గుర్తుకొస్తారు. కానీ మధ్యలో కేటీఆర్ ప్రవేశం చేసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారు. కానీ పార్టీలో ట్రబుల్ షూటర్ గా, పార్టీకి మైలేజ్ ఇచ్చే నాయకుడుగా హరీష్ రావు ది ఎప్పటికీ ప్రత్యేక స్థానమే.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తాజాగా అయిన తన సొంత పాదయాత్ర చేపట్టారు. కేవలం 15 కిలోమీటర్లు మాత్రమే చేసిన పాదయాత్రకు యావత్ రాష్ట్రాన్ని తన వైపు

- మిగతా 2వ పేజీలో



# ఎల్ నినోకు అడ్డుకట్ట

### రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
### మరింత విస్తారంగా కురిసే అవకాశం
### రైతుల్లో తొలగిన ఆందోళన
### పంటల సాగుకు ఉపయుక్తంగా వాన

2లో

# మల్లారెడ్డి విషయంలో మౌనమేలా?!

### ఆయన సమక్షంలోనే కెసిఆర్ పై సీఎం విమర్శలు
### అయినా ఖండించని వైనం
### పార్టీ నుంచి వేటు వేస్తే మంచిదంటున్న క్యాడర్

మాజీ మంత్రి మల్లారెడ్డి వ్యవహార శైలి ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతోంది. గత రెండు రోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన పార్టీ మారబోతున్నారని స్వయంగా గులాబీ పార్టీ క్యాడరే చెబుతోంది.



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అందెశ్రీ కార్యక్రమంలో కెసిఆర్ తో పాటు భారత రాష్ట్ర సమితి పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గజ్వేల్ లోనే సమాధి చేస్తానంటూ సవాల్ విసిరారు. అప్పుడు సీఎం రేవంత్ వెనుకాలే ఉన్నారు

- మిగతా3వ పేజీలో

# విశాఖ ఎంపీగా గంటా!

### ఈసారి పార్లమెంట్ కు వెళ్లాలని గట్టి నిర్ణయం
### కొత్తగా ఏర్పాటు కాబోయే సెంట్రల్ లోక్సభ నియోజకవర్గం నుంచి పోటీ

**క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం:** ఏపీలో మళ్లీ నియోజకవర్గాల పెంపు అంశం తెరపైకి వచ్చింది. పార్లమెంటులో డి లిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. జాతీయస్థాయిలో బిజెపితో పాటు ఎన్డీఏకు పెరిగిన లోక్సభ సభ్యుల బలంతో ఎలాగైనా బిల్లు ఆమోదానికి కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే దేశవ్యాప్తంగా లోక్సభ, అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. ఇప్పుడున్న నియోజకవర్గాలకు 50% అదనంగా రానున్నాయి. ఈ లెక్కన ఏపీలో 85 అసెంబ్లీ సీట్లు, 13 పార్లమెంటు స్థానాలు పెరగనున్నాయి.



2లో

### మూడోరోజూ పార్లమెంట్‌లో
# గందరగోళం

### విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ
### నల్ల చొక్కాలతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన
### ప్రధాని ఇంటిముందు ధర్నాకు కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్
### ఖర్గే నివాసానికి వెళ్లి...గుట్టుచప్పుడు కాకుండా ధర్నా
### పోలీసులను ఆయోమయంలోకి నెట్టి కాంగ్రెస్ తీరు



2లో

3లో




# తెలంగాణ టిడిపిపై లోకేష్ ఫోకస్!

### వారంలో ఒకరోజు పార్టీకి కేటాయింపు
### చంద్రబాబు కీలక నిర్ణయం

# మోదీతో బాబు!

## ఢిల్లీలో గంట పాటు సమావేశం

### భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం
### ఇద్దరు నేతల మధ్య కీలక చర్చలు .. ఢిల్లీలో బిజీ బిజీగా ఏపీ సీఎం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. బుధవారం ఆయన ప్రధాని నరేంద్ర మోడీతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పార్లమెంట్ భవనంలో గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో ఏపీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి



- మిగతా3వ పేజీలో

### ఇండిగో ఉద్యోగినిపై
# క్యాబ్ డ్రైవర్ అఘాయిత్యం

### క్యాబ్‌ను దారిమళ్లించి అత్యాచారం
### ఫిర్యాదుతో డ్రైవర్ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

# ఎల్లుండి తెలంగాణలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

### విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపు
### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
### ఎన్‌టీఏను రద్దు చేయాలని పట్టు
### వీవీబీఎస్ఏ బిల్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్
### ఢిల్లీ పోలీసుల చర్యలపై విచారణకు డిమాండ్

### మూడోరోజూ పార్లమెంట్‌లో

# గందరగోళం

వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు. ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని మోదీ నివాసం ముందు మంగళవారం కాంగ్రెస్ నేతలు మెరుపు ధర్నా చేపట్టిన విషయం పక్కా ప్లాన్‌తో చేపట్టినట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీకేజీతో పాటు సీజేపీ కార్యకర్తలపై లాఠీఛార్జ్ అంశంలో ఆ ధర్నా నిర్వహించారు. అయితే కట్టుదిట్టమైన లోక్ కళ్యాణ్ మార్గ్ కు కాంగ్రెస్ నేతలు అంతా ఎలా వెళ్లారని ఢిల్లీ పోలీసులు ఇప్పుడు ఆరా తీసే పనిలో పడ్డారు. వాస్తవానికి మంగళవారం కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఖర్గే ఇంటికి కాంగ్రెస్ నేతలు వెళ్లారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజాజి మార్గ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే నివాసం ఉన్నది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు అనేక మంది ఎంపీలు తొలుత మల్లిఖార్జున్ ఖర్గే ఇంటికి వెళ్లారు. ఖర్గేకు 84వ పుట్టిన రోజు విషెస్ తెలిపారు. కానీ కాంగ్రెస్ నేతలు అకస్మాత్తుగా మరో ప్లాన్ వేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని ఇంటి వైపు ర్యాలీ తీశారు. ఖర్గే ఇంటికి కొన్ని మీటర్ల దూరంలోనే ప్రధాని మోదీ నివాసం ఉన్నది. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ఎంపీలు .. ప్రధాని మోదీ గేటు ముందు చేరుకున్నారు. అక్కడే మెరుపు దాడికి దిగారు. సుమారు మూడు గంటల పాటు బైఠాయించారు. ఢిల్లీ పోలీసులు ఈ ఘటనతో షాక్ అయ్యారు. సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కట్టుదిట్టమైన ప్రాంతంలోకి ఒకేసారి ఇంత మంది ఎలా వచ్చారని పోలీసులు ఆలోచిస్తున్నారు. అయితే ఖర్గే పుట్టినరోజు కావడం వల్ల ఆ ప్రాంతంలో భారీ సంఖ్యలో ఉదయం నుంచే జనం ఉన్నారని, రాజాజి మార్గ్‌లో అనేక వాహనాలను కూడా పార్క్ చేసినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 7 లోక్ కల్యాణ్ మార్గ్ లొకేషన్‌లో కాంగ్రెస్ ఎంపీలు ధర్నాకు దిగడం పట్ల ఢిల్లీ పోలీసులు కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు తెలిసింది.అయితే ఈ ఘటనకు ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియదు. కానీ ఢిల్లీ పోలీసులు మాత్రం సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు అంగీకరిస్తున్నారు. ఖర్గే ఇంటికి చేరిన కాంగ్రెస్ నేతలు.. పార్లమెంట్ సమీపంలో ఉన్న విజయ్ చౌక్‌కు ర్యాలీ తీస్తారని భావించినట్లు కొందరు పోలీసులు చెప్పారు.

# కట్టడిలో హరీష్!



తిప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, పక్కా మాస్ లీడర్ గా గుర్తింపు ఉంది. ఉద్యమ సమయం నుంచి పార్టీకి ఏ కష్టం వచ్చినా ముందు వరుసలో నిలబడి పరిష్కరించడం ఆయనకు ఉన్న అలవాటు. అయితే అటువంటి నాయకుడి సేవలను పార్టీ హై కమాండ్ సక్రమంగా వినియోగించుకోవడం లేదనేది ఒక వాదన. హరీష్ రావును కేవలం తన సొంత నియోజకవర్గానికి, ఉమ్మడి జిల్లాకు మాత్రమే పరిమితం చేయడం పార్టీలో ఒక వర్గానికి రుచించడం లేదు.

**క్షేత్రస్థాయిలో పట్టున్న నేత..**

కెసిఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో పట్టున్న నాయకుడు హరీష్ రావు. ఇటీవల తన సిద్దిపేట పాదయాత్ర ద్వారా మరోసారి తన బలాన్ని నిరూపించుకున్నారు. కాలేశ్వరం నీళ్లు, రైతాంగ సమస్యలపై ఆయన కేవలం ఒక మండల స్థాయిలో పిలుపునిచ్చారు. కానీ వేలాదిగా జనం తరలివచ్చారు. మీడియా బిల్డప్పులు లేవు. సోషల్ మీడియా ప్రచారాలు లేకుండా నేరుగా ఆయన ప్రజలతో మమేకమైన తీరు మాత్రం అభినందించదగ్గది. సోషల్ మీడియా హడావుడికే పరిమితమైన నేతల మధ్య.. రోడ్డెక్కి పోరాటం చేసే మాస్ లీడర్ గా ఆయనకు ఉన్న గుర్తింపు చెక్కుచెదరలేదు. అయితే ఈ స్థాయి క్రేజ్ చూసి సొంత పార్టీలోనే ఉన్న వ్యతిరేకులు ఆయనపై అనేక రకాల ముద్రలు వేస్తూ వస్తున్నారు.

## వ్యూహాత్మక తప్పిదం..

ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి పరిస్థితి ఏమంత బాగాలేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీ పుంజుకోవాలి. ఇటువంటి సమయంలో హరీష్ రావు సేవలను ఒక జిల్లాకు మాత్రమే పరిమితం చేయడం ఆ పార్టీ వ్యూహాత్మక తప్పిదం. హరీష్ రావుకు ఎలాంటి సరిహద్దు ఆంక్షలు విధించకుండా.. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ క్యాడర్ లో వచ్చే ఊపు అసాధారణంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు ఉన్నారు. రేవంత్ ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయడంలో కానీ.. క్షేత్రస్థాయిలో క్యాడర్ను సమాయత్తం చేయడంలో గాని హరీష్ రావుకు ఉన్న రాజకీయ చాణుక్యం మరొకరికి లేదనడం అతిశయుక్తి కాదు. కానీ హరీష్ రావును కావాలనే కట్టడి చేస్తున్నారని విమర్శ పార్టీలో ఉంది. అంతర్గత కుటుంబం, వారసత్వ రాజకీయ సమీకరణలతో అలా చేస్తున్నారు అనేది బహిరంగ రహస్యం. అయితే ఇలానే హరీష్ రావును ఒక జిల్లాకు పరిమితం చేస్తే మాత్రం.. హరీష్ తో రాజకీయం చేసి లబ్ధి పొందాలనుకుంటున్న జాతీయ పార్టీలకు ప్రయోజనం. మరి ఆలోచించుకోవాల్సింది పార్టీ హై కమాండ్ మాత్రమే.

# విశాఖ ఎంపీగా గంటా!



అందుకే ఇప్పుడు నేతలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. భవిష్యత్తులో అవకాశాల కోసం ఇప్పటినుంచి ఆలోచన ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సీనియర్ నేత గంటా శ్రీనివాసరావు లోక్ సభకు పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

**కొద్దిరోజుల కిందట కామెంట్..**

వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ స్థానానికి పోటీ చేయాలని ఉందని తన మనసులో ఉన్న మాటను బయటపెట్టారు గంటా శ్రీనివాసరావు. ప్రస్తుతం విశాఖ ఎంపీగా శ్రీ భరత్ ఉన్నారు. ఆయన అసెంబ్లీకి పోటీ చేస్తే తాను పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తానంటూ తన మనసులో ఉన్న మాటను బయటపెట్టారు గంటా. అయితే తాను పార్లమెంట్ స్థానాన్ని వదులుకునే ప్రసక్తి లేదని.. మళ్లీ ఎంపీగానే పోటీ చేస్తాను అంటూ శ్రీ భరత్ దీనిపై క్లారిటీ ఇచ్చారు. అయితే ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి రావడంతో.. కొత్తగా ఏర్పాటు కాబోయే లోక్సభ నియోజకవర్గం నుంచి గంటా శ్రీనివాసరావు రంగంలోకి దిగుతారని కొత్తగా ప్రచారం మొదలైంది.

**విశాఖ నుంచి కొత్త నియోజకవర్గం..**

నియోజకవర్గాల పునర్విభజనతో ఉత్తరాంధ్ర నుంచి రెండు నుంచి మూడు పార్లమెంటు సీట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రధానంగా విశాఖ సెంట్రల్ నియోజకవర్గంతో ఒక లోక్సభ స్థానం అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఆ నియోజకవర్గ నుంచి గంటా శ్రీనివాసరావు బరిలో దిగుతారని తెలుస్తోంది. గతంలో తెలుగుదేశం పార్టీ ద్వారా ఎంపీ అయ్యారు గంటా శ్రీనివాసరావు. 1999లో తొలిసారిగా అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2004లో చోడవరం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి గెలిచారు. ప్రజారాజ్యం కాంగ్రెస్ పార్టీలో విలీనం కావడంతో మంత్రి కూడా అయ్యారు. 2014లో భీమిలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు టిడిపి అభ్యర్థిగా. ఐదేళ్లపాటు మంత్రిగా కూడా వ్యవహరించారు. 2019లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో భీమిలి నుంచి అత్యధిక మెజారిటీతో గెలిచారు. అయితే వచ్చే ఎన్నికల్లో కొత్తగా ఏర్పడబోయే విశాఖ సెంట్రల్ లోక్సభ నియోజకవర్గం నుంచి బరిలో దిగేందుకు ఆయన గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# బిజెపి బెంగాల్ వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)

### ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు..

బిజెపికి జాతీయాధ్యక్షుడుగా నితిన్ నబీన్ ఉన్నారు. కానీ పార్టీ విధానపరమైన నిర్ణయాలన్నింటిని అమిత్ షా చూస్తుంటారు. అయితే ఇప్పుడు తెలంగాణ పై అమిత్ షా ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఈనెల 26న తెలంగాణకు రానున్నారు. కరీంనగర్ లో జరిగే ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవుతున్నారు. పనిలో పనిగా తెలంగాణ బిజెపి ముఖ్య నేతలతో సమావేశం అవుతారని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చిస్తారని సమాచారం. పనిలో పనిగా భారత రాష్ట్ర సమితితో పొత్తుపై కూడా ఓకింత క్లారిటీ ఇవ్వనున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో బలోపేతం..**

తెలంగాణను బిజెపి ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ 8 చోట్ల విజయం సాధించింది. అయినా సరే అదే దూకుడుతో ముందుకు వెళ్లడంతో అక్కడకు ఎనిమిది నెలల వ్యవధిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 8 పార్లమెంటు స్థానాలను సాధించింది. అధికార కాంగ్రెస్ పార్టీకి ధీటుగా నిలబడింది. అయితే గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ, నగర ప్రాంతాల్లో ఆ పార్టీకి పట్టు ఎక్కువ. అందుకే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింతగా విస్తరించాలని భావిస్తోంది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పట్టున్న బలమైన నేతలను బిజెపిలోకి రప్పించేందుకు వ్యూహరచన చేస్తోంది.



**పెద్ద ఎత్తున ఆకర్ష్..**

తెలంగాణలో బిజెపి ఆకర్ష్ లో భాగంగా పెద్ద ఎత్తున ఇతర పార్టీ నేతలను ఆకర్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. శ్రావణమాసం సందర్భంగా ఇతర పార్టీల నాయకుల చేరిక పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ఈ నెల 26న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కరీంనగర్ వస్తున్నారు. పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అవుతారు. గ్రేటర్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలపై కీలక టాస్క్ ఇస్తారు. మొత్తానికైతే బీజేపీ తెలంగాణపై గట్టిగానే గురి పెట్టింది.

**అన్ని జిల్లాల్లో సర్వే..**

తెలంగాణలో ఏబీఎంతో పాటు జార్విస్ స్ట్రాటజీ సంస్థలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ రెండు సంస్థలు బిజెపి కోసం పనిచేస్తుంటాయి. ఈ సంస్థల ప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ.. వివిధ జిల్లాల్లో సర్వేలు చేస్తున్నాయి. బిజెపి బలం, బలహీనతలు, సామాజిక సమీకరణలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, ఇతర పార్టీల ప్రభావం వంటి అంశాలపై నివేదికలు సిద్ధం చేస్తున్నాయి. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ పర్యవేక్షణలో ఈ సర్వే కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున తెలంగాణలో పార్టీ చేరికలపై బిఎల్ సంతోష్ ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ.. పార్టీ నేతల మధ్య సమన్వయానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక సిద్ధం చేశారు. అందులో భాగంగానే ఈటెల రాజేందర్, బండి సంజయ్ ల మధ్య రాజి ఫార్ములా రూపొందించారు.

# ఎల్ నినోకు అడ్డుకట్ట

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ముఖం చాటేయడంతో కొద్దిరోజులుగా దేశ వ్యాప్తంగా నెలకొన్న ఆందోళనకు ఎట్టకేలకు ఫుల్ స్టాప్ పడింది. అందరి ఆందోళనలను దూరం చేస్తూ వర్షాలు సమృద్ధిగా కురిసే పరిస్థితులు మళ్లీ వచ్చాయి. బంగాళాఖాతంలో మరో అల్పపీడనానికి అనువైన వాతావరణం ఏర్పడిన కారణంగా రుతుపవనాలు తిరిగి బలంగా పుంజుకోవడానికి సిద్ధమవుతున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని, కొన్ని చోట్ల భారీ వర్షాలు పడతాయని భావిస్తోంది. దేశంలో, ముఖ్యంగా తెలంగాణలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవటంతో రైతులు సాగు పనుల్లో ముందుకెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. రుతుపవనాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించినప్పటికీ జూన్ నుంచి జూలైలో రెండురోజుల క్రితం దాకా సాధారణ వర్షపాతం కూడా నమోదుకాలేదు. దీంతో రైతులు వర్షాలకోసం ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. రుతుపవనాలు మళ్లీ వస్తున్నాయని.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వారం రోజులు వర్షాలు కురుస్తాయని తెలిపింది. వాయవ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా -- బెంగాల్ తీరాల్లో అల్పపీడనం బలపడిందని, కోస్తాంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని, వర్షాల సమయంలో గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. అల్పపీడనానికి అనుబంధంగా ఒక ఆవర్తన ద్రోణి కూడా కొనసాగుతున్నందున రాష్ట్రంలో నాలుగైదు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. వర్షాలు కురుస్తున్న సమయంలో ఈదురుగాలుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.వాతావరణ శాఖ అంచనా వేసినట్లుగానే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ఇది రైతులకు ఎంతో ఊరటనిస్తోంది. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంవో వర్షాలు సరిగా కురవవని, రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే. దీంతో రైతులు అయోమయ పరిస్థితుల్నిఎదుర్కొంటునారు. వాతావరణ శాఖ తెలియజేసిన సమాచారం ప్రకారమే వానలు కురవడం మొదలుపెట్టడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

# ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అఘాయిత్యం

హైదరాబాద్,జూలై22: ఒంటరిగా మహిళ కనిపిస్తే చాలు.. అఘాయిత్యానికి ఒడిగడుతున్నారు. తాజాగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా ఓ ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవరే అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఇప్పుడు సిటీలో హాట్‌టాపిక్‌గా మారింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేస్తున్న ఓ ఇండిగో ఎయిర్‌లైన్స్ క్యాబిన్ క్రూ ఉద్యోగినిపై ఓ కామాంధుడు తెగబడ్డాడు. ఆమెను ఎయిర్ పోర్టుకు తీసుకు వెళ్లే క్యాబ్ డ్రైవరే అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రతిరోజూ ఉద్యోగులను డ్యూటీకి తీసుకెళ్లే క్యాబ్ డ్రైవర్‌పై ఆ ఉద్యోగినికి నమ్మకముంది. కానీ తనపై ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో క్యాబిన్ క్రూగా పనిచేస్తున్న బాధితురాలు 20న మధ్యాహ్నం డ్యూటీ కోసం శంషాబాద్ విమానాశ్రయానికి క్యాబ్‌లో బయలుదేరింది. క్యాబ్ డ్రైవర్ ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ మార్గమధ్యంలో వాహనాన్ని దారి మళ్లించాడు. విమానాశ్రయం సమీపంలోని నిర్మాణంలో ఉన్న సాంక్టా మారియా స్కూల్ వద్ద ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ క్యాబ్‌ను ఆపిన నిందితుడు 'టాయిలెట్‌కు వెళ్లి వస్తాను' అంటూ కిందకు దిగాడు. అనంతరం వెనుక సీటు వద్దకు వచ్చి బాధితురాలిపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనతో తీవ్ర షాక్‌కు గురైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు అందుకున్న శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అవుట్‌పోస్ట్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఎల్లుండి తెలంగాణలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలకు నిరసనగా జులై 24న తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు ఈ బంద్‌లో పాల్గొంటున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు బంద్ వివరాలను వెల్లడించారు. వరుస పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని, విద్యా వ్యవస్థ స్వయంప్రతిపత్తికి భంగం కలిగిస్తోందని ఆరోపిస్తున్న వీవీబీఎస్ఏ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసుల దాడిపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.జులై 24న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు, మేధావులు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది.

# మల్లారెడ్డి విషయంలో మౌనమేలా?!

మల్లారెడ్డి. కనీసం స్పందించలేదు. ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేగా సభకు వెళ్లారు అనుకున్నారు. తమ అధినేత కెసిఆర్ పై విమర్శలు చేసిన సమయంలో మల్లారెడ్డి అభ్యంతరం తెలిపితే బాగుండేది. కనీసం సభ అయ్యాక అయినా.. సోషల్ మీడియాలో అయినా రేవంత్ వ్యాఖ్యలను ఖండించకపోవడంతో మల్లారెడ్డి తీరుపై గులాబీ పార్టీ శ్రేణులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

**పార్టీకి దూరంగా..**

గత కొంతకాలంగా మల్లారెడ్డి భారత రాష్ట్ర సమితితో అంటి ముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. ఇటీవల కేటీఆర్ గ్రేటర్ హైదరాబాద్ పార్టీ సమావేశాలను ఏర్పాటు చేశారు. వాటికి సైతం మల్లారెడ్డి హాజరు కాలేదు. చివరకు పార్టీ కార్యాలయాలకు సైతం దూరంగానే ఉంటున్నారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు వెళ్లడం, కాంగ్రెస్ నాయకులతో సమానంగా సీఎంకు బొకేలు ఇచ్చి స్వాగతించడం, రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతుంది.



**బలమైన నాయకుడు కావడంతో..**

మల్లారెడ్డి బలమైన నాయకుడిగా మారిపోయారు. ఆర్థిక బలం ఎక్కువ. మొన్న మధ్యన ప్రధాని మోదీ తో మల్లారెడ్డి కుటుంబం ప్రత్యేకంగా భేటీ అయింది. ఆయన కోడలు ప్రీతి రెడ్డి రాజకీయ వ్యాఖ్యల తర్వాత మల్లారెడ్డి ఫ్యామిలీ బీజేపీలోకి వెళ్తుందని అంతా భావించారు. కానీ ఎందుకో వెనక్కి తగ్గారు. ఇప్పుడు మాత్రం మల్లారెడ్డి పార్టీ మారేందుకు మొగ్గు చూపుతున్నారు అన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**నిజంగా తప్పుడు సంకేతమే..**

సాధారణంగా పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే గులాబీ పార్టీ అధినాయకత్వం వెంటనే రంగంలోకి దిగుతుంది. తప్పుడుగా వ్యవహరించే నేతలకు నోటీసులు జారీచేస్తుంది. కానీ మల్లారెడ్డి విషయంలో మాత్రం మౌనంగా ఉంది. ఇది తప్పుడు సంకేతం అని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మల్లారెడ్డి పట్ల ఇంకా పార్టీ ఊగిసలాట మంచిది కాదని.. ఇది ఎంత మాత్రం మంచి పద్ధతి కాదని.. మల్లారెడ్డి పై వేటు వేయడమే మంచిదన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరి ఆ పార్టీ హై కమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



## ఎలాంటి అనుమతులు లేకుండా మసీదును నిర్మించడం తగదని

### ప్రకాష్ నగర్ కాలనీవాసులు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కి ఫిర్యాదు

గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ పట్టణం లోని ప్రకాష్ నగర్ కాలనీ మధ్యలో మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా మసీదును నిర్మించడం తగదని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు నర్ర పాండు, నర్రగిరి మాట్లాడుతూ ప్రకాష్ నగర్ కాలనీలో ఎక్కువ మంది హిందువులు నివాసం ఉంటున్నారు అలాంటి కాలనీ దగ్గరలో మసీదును నిర్మించడం వల్ల రెండు మతాల మధ్య గొడవలు జరిగే అవకాశాలు ఉన్నందువల్ల తక్షణమే మసీదు నిర్మాణాన్ని ఆపేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు . ఇప్పటికే అనేక సందర్భాలలో ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోకపోవడం వల్ల కలెక్టర్ నారాయణ రెడ్డి గారికి కలిసి సమస్యను వివరించినట్టు నర్రగిరి తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్ర శ్రీను వాసులు, నర రామారావు, మక్కల చంద్రశేఖర్, మక్కల ప్రేమ్ కుమార్, మక్కల రాజు , మక్కల జలంధర్ తదిరదులు పాల్గొన్నారు.

# మోదీతో బాబు!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమను ప్రధానికి బహుకరించారు సీఎం చంద్రబాబు. ఆగస్టు 1 నిర్వహించ తలపెట్టిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాలని ప్రధాని మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు పర్యటనతో ఢిల్లీ మీడియా ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో టిడిపి ఎంపీలు చంద్రబాబు వెంట కనిపించారు.

**ఈ అంశాలపై చర్చ..**

ప్రధాని నరేంద్ర మోడీతో జరిగిన చర్చల్లో ప్రధానంగా అమరావతి రాజధాని నగర నిర్మాణం, ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పురోగతి, రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధుల విడుదలపై విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది. రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి, విభజన హామీల ప్రకారం అందాల్సిన అదనపు ఆర్థిక సాయం త్వరగా అందించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు మౌలిక వసతుల కల్పన, కొత్త పారిశ్రామిక కారిడార్లు, ప్రాజెక్టుల పురోగతికి కేంద్రం నుంచి పూర్తి సాంకేతిక, ఆర్థిక సహకారాన్ని కూడా సీఎం చంద్రబాబు కోరారు.

**పరస్పర సమన్వయం..**

మరోవైపు రాజకీయాలు సైతం వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని ఈ సమావేశంలో ఇద్దరు నేతలు అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ నివారణ, పోలవరం పనుల వేగవంతం వంటి అంశాల్లో కేంద్రం తరుపున తగిన మద్దతు లభిస్తుందని ప్రధాని నుంచి హామీ లభించినట్లు సమాచారం. అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతం చేసి.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేస్తామని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

**కేంద్ర మంత్రులతో భేటీలు..**

రోజంతా సీఎం చంద్రబాబు ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అనంతరం సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో పాటు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, మనోహర్లాల్ కట్టర్, సి ఆర్ పాటిల్ తొ సహా కీలక మంత్రులతో సమావేశం అయ్యారు. అమరావతి నగర అభివృద్ధి, ఐటి, పారిశ్రామిక పెట్టుబడులు, సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన కేంద్ర గ్రాంట్లు, అనుమతులపై వారితో విస్తృతంగా చర్చలు జరిపారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో ఏపీ కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. చంద్రబాబు ఢిల్లీ పర్యటన నేషనల్ మీడియాలో హైలెట్గా నిలిచింది.

# తెలంగాణ టిడిపిపై లోకేష్ ఫోకస్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణపై తెలుగుదేశం ఫోకస్ పెట్టిందా? ఆ రాష్ట్రంలో పార్టీని అభివృద్ధి చేయనుందా? ఈ విషయంలో పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ దృష్టి పెట్టారా? వారంలో ఒకరోజు సమయాన్ని తెలంగాణ టిడిపికి కేటాయించనున్నారా? పొలిటికల్ సర్కిల్స్ లో దీని పైనే ప్రచారం నడుస్తోంది. గత కొంతకాలంగా తెలంగాణలో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆవేదన కనిపిస్తోంది. అక్కడ నాయకులు లేకపోయినా తెలుగుదేశం పార్టీకి క్యాడర్ ఉంది. ఆ కేడర్ను మరింత బలోపేతం చేసేందుకు ఇప్పుడు చంద్రబాబు ఆ బాధ్యతను లోకేష్ కు అప్పగించినట్లు తెలుస్తోంది.

**నేతల ఆసక్తి..**

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు తెలంగాణ టిడిపి పై దృష్టి పెట్టారు. అవకాశం ఉన్నప్పుడు చాలామంది నేతలు చంద్రబాబును కలుస్తూ వెళ్లారు. ఒకప్పుడు టిడిపిలో పనిచేసిన చాలామంది ఎమ్మెల్యేలు, భారత రాష్ట్ర సమితిలో అసంతృప్తిగా ఉన్న నేతలు చంద్రబాబును కలుస్తూ వచ్చారు.. తీగల కృష్ణారెడ్డి, అరికెపూడి గాంధీ మాధవరం కృష్ణారావు వంటి నేతలు పార్టీలో పని చేసేందుకు సిద్ధపడ్డారు. మాజీ మంత్రి బాబు మోహన్ అయితే చంద్రబాబును కలిసి పార్టీలో చేరుతానని కూడా సంసిద్ధత వ్యక్తం చేశారు. కానీ ఎందుకో చంద్రబాబు పెద్దగా మొగ్గు చూపలేదు. పార్టీని బలోపేతం చేసే బాధ్యతను వాయిదా వేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గాలను ప్రకటించలేదు. ఒకరిద్దరు తెలంగాణ నేతలను పోలిట్ బ్యూరోలోకి తీసుకున్నారు. అయితే ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తెలంగాణలో పార్టీని బలోపేతంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఆ బాధ్యతను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అప్పగించినట్లు సమాచారం.

**సీట్లు పెంచుకోవాలని..**

ప్రస్తుతం ఏపీ మంత్రిగా ఉన్నారు నారా లోకేష్. ప్రభుత్వంతో పాటు పార్టీలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఈ సమయంలో వారానికి ఒకరోజు తెలంగాణలో పార్టీ కోసం సమయాన్ని కేటాయిస్తారని తెలుస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు దిశగా తెలంగాణలో మిగతా రాజకీయ పార్టీలు ప్రయాణిస్తున్నాయి. ఈ క్రమంలో పార్టీని బలోపేతం చేసి పొత్తులో భాగంగా సీట్లతో పాటు ఓట్లు పెంచుకోవాలని చూస్తున్నారు చంద్రబాబు. అందుకే తెలంగాణలో పార్టీని క్రియాశీలకం చేసి.. క్యాడర్ను మరింత బలోపేతం చేస్తే ఫలితం ఉంటుంది అని ఆలోచన చేస్తున్నారు. లోకేష్ ను యాక్టివ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే లోకేష్ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి.



## ప్రభుత్వ పాఠశాలలో భోజన కొరత వసతులపై తహసీల్దార్‌కు వినతి

### తక్షణమే ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి: దొంతగొని అమరేందర్

**సంస్థాన్ నారాయణపురం, జూలై 22(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల లేమి, మధ్యాహ్న భోజన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పుట్టపాక 5వ వార్డు సభ్యులు, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దొంతగొని అమరేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తహసీల్దార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ మండలంలోని 27 ప్రాథమిక, 9 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన రేషన్ సరుకులు సరిగ్గా అందక విద్యార్థులు ఆకలితో పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అలాగే స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే పాఠశాలలను తనిఖీ చేసి, కనీస వసతులు కల్పించాలని, లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## బాసర ఆలయంలో వరుణయాగం

### వర్షాలు కురవాలని యాగ నిర్వహణ

బాసర: చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో బుధవారం వరుణయాగం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురియక పోవడంతో వరుణ యాగం చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో వరుణయాగాన్ని మంగళ వాయిద్యాలతో బాలలయం నుండి వైదికశాల ప్రవేశం అనంతరం గురు ప్రార్థన, వరుణయాగ సంకల్పం, గణపతి పూజ, పుణ్యహవాచణం, నాంది ముఖం, నవగ్రహ మండప వరుణ కళశస్థాపన, అగ్ని ప్రతిష్ట, వరుణ జపములు స్థాపిత దేవతా పూజ హోమములు, నిర్వహించారు.

## బాబుల్‌రెడ్డినగర్‌లో సొంత నిధులతో శ్రీ అచలగురు ఆశ్రమానికి స్లాబ్ వేయించిన సోమ శ్రీనివాస్

గండిపేట(క్రైమ్ మిర్రర్): కాటేదాన్ డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లోని శ్రీ అచలగురు ఆశ్రమంకి పైన కొత్తగా స్లాబ్ సుమారు 4 లక్షల రూపాయలతో స్థానిక కాంగ్రెస్ నాయకుడు సోమ శ్రీనివాస్ స్లాబ్ వేయించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ చేతుల మీదుగా పూజా కార్యక్రమాలను బుధవారం చేయించి ఆశ్రమంలో కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ధనుంజయ, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ప్రేమ్‌గౌడ్, నాయకులు సరికొండ వెంకటేష్, సందుల హనుమంత్‌సాగర్, సందుల నారాయణసాగర్, పోతురాజు మల్లేష్, రాములు, జక్కలపల్లి వెంకటయ్య, మణెమ్మ, కాళీదాస్ వి.మల్లేష్, ఓంప్రకాష్,కళ్లెం లక్ష్మారెడ్డి, పల్లపు జగన్, ఏటి నాగరాజు, డి.కృష్ణ, దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంత్‌సాగర్, కే శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, శోభా, రవిముదిరాజ్,కోట పవన్ కుమార్ నేత, మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, సోమ సందీప్ గుప్తా, బినపర్తి రాము నేత, రాయుడు, దినేష్, నవీన్, వల్లకొండ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఢీల్లీలో రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో::** కేంద్ర ప్రభుత్వ విధానాలకు, ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ వివాదానికి వ్యతిరేకంగా ఢీల్లీలో ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ని ఢీల్లీ పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ ఖమ్మం నగరంలో డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్వర్యంలో నిర్వహించిన నిరసన ధర్నా లో వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు తో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బలప్రయోగం ద్వారా నిరసనలను అణిచి వేయాలని చూస్తోందని విమర్శించారు. ఈ అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధమంటూ ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజల తరుపున గొంతెత్తిన ప్రతిపక్ష నాయకుడిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో అక్రమాలు, విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## బాబుల్‌రెడ్డినగర్‌లో రూ.26 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో సుమారుగా 26 లక్షలతో కొత్తగా సీసీ రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చోరవతో నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లు, కాలనీలు, బస్తీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ధనుంజయ,

మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు టి. ప్రేమ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, సరికొండ వెంకటేష్, కాళీదాస్, వి.మల్లేష్, ఓంప్రకాష్, కళ్లెం లక్ష్మారెడ్డి, పల్లపు జగన్, ఏటి నాగరాజు, డి.కృష్ణ, దుర్గాప్రసాద్, హనుమంత్, సాగర్, కే శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, శోభా, రవిముదిరాజ్,కోట పవన్ కుమార్ నేత, సోమ సందీప్ గుప్తా, మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, రాయుడు, యంజాల శేఖర్ నేత, నవీన్,బోనకుర్తి రాము నేత, వల్లకొండ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులు ప్రజాస్వామ్యానికి విఘాతం

### టీపీసీసీ నేత వాసిరెడ్డి నరేష్



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా ప్రధానమంత్రి నివాసం ఎదుట శాంతియుతంగా ధర్నా చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ (మీడియా, కమ్యూనికేషన్స్) వాసిరెడ్డి నరేష్ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీలు, నాయకులను ఎలాంటి చర్చలు లేకుండా పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామిక చర్యగా ఆయన అభివర్ణించారు. దేశవ్యాప్తంగా నీట్ సహా పలు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వరుస వైఫల్యాలకు బాధ్యత వహించలేని మంత్రి పదవిలో కొనసాగడం సమంజసం కాదని, దీనిపై దేశ యువత సమాధానం కోరుతోందని అన్నారు. పార్లమెంట్ ప్రజల సమస్యలను చర్చించే అత్యున్నత వేదిక అని గుర్తు చేసిన ఆయన, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అలాగే, నీట్ పేపర్ లీక్‌ల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంటున్న 18 మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌పై కేంద్ర ప్రభుత్వం దేశానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి, ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు అరెస్టులు, పోలీసు బలప్రయోగాన్ని ఆశ్రయించడం అత్యంత దురదృష్టకరమని వాసిరెడ్డి నరేష్ అన్నారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, అధికార అహంకారాన్ని వీడి విద్యార్థులకు న్యాయం చేయాలని, దేశ భవిష్యత్తును కాపాడే చర్యలు తీసుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

### మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం

### ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కేళవత్ మధు నాయక్



క్రైమ్ మిర్రర్,పాలకీడు : విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం నిరంకుశ పాలనకు నిదర్శనం దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని,దేశంలో నిరంకుశ పాలనకు ఇదే నిదర్శనమని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కేళవత్ మధు నాయక్ వ్యాఖ్యానించారు. సూర్యపేట జిల్లా, పాలకవీడు మండల కేంద్రంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కేళ వత్ మధునాయక్ మాట్లాడుతూ, ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేతలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, అలాంటి హక్కులను అణచివేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు . ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సంఘటనపై నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని మధునాయక్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**దశాబ్దాల కిందట పూజ్య బాపూజీ నోటి నుంచి వెలువడిన ఈ సువర్ణాక్షర సందేశం, వర్తమాన సమాజం ఎదుర్కొంటున్న పెను పర్యావరణ సంక్షోభానికి అద్దం పడుతోంది. నానాటికీ దిగజారుతున్న పర్యావరణ సమతుల్యత మానవాళి మనుగడకే సవాలుగా పరిణమించింది. ఆధునిక నాగరికత, శీఘ్ర గతిన విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ పేరుతో మనిషి చేస్తున్న నియంత్రణ లేని ధ్వంసకాండ భూతాపానికి (గ్లోబల్ వార్మింగ్) దారితీస్తోంది.**

## భూగోళం బొబ్బలెక్కుతోంది...

# అత్యాశే అసలు విపత్తు!



ప్రకృతి ప్రసాదించిన వనరులను అవసరానికి మించి విచ్చలవిడిగా దోపిడీ చేయడమే నేడు మనం అనుభవిస్తున్న ఈ విపత్కర పరిస్థితులకు పరాకాష్ట అని పర్యావరణ వేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మనిషి మనుగడకు అత్యంత ఆవశ్యకమైనవి స్వచ్ఛమైన గాలి, మంచినీరు, ఆహారం మరియు నివాసం. ఇవి ప్రాణికోటికి ప్రకృతి ఉచితంగా అందించిన అమూల్యమైన ప్రసాదాలు. అయితే, కాలక్రమేణా అవసరం అనేది అత్యాశగా రూపాంతరం చెందింది. ఒక వృక్షం నుండి ఫలాలను స్వీకరించడం అవసరమైతే, స్వల్పకాలిక లాభాల కోసం, వ్యాపార ప్రయోజనాల కోసం ఏకంగా ఆ చెట్టునే నరికివేసి కలపగా మార్చుకోవడం పక్కా అత్యాశే అవుతుంది. దాహం తీర్చుకోవడానికి నదీజలాలను ఉపయోగించుకోవడం సహజ న్యాయం కాగా, పారిశ్రామిక వ్యర్థాలను రసాయనాల రూపంలో ఆ జలాల్లోకి వదిలి నదులను విషతుల్యం చేయడం అపరిమితమైన దురాశకు నిదర్శనం. మానవ చరిత్రను తిరగేస్తే, వేల సంవత్సరాల పాటు మన పూర్వీకులు ప్రకృతితో మమేకమై జీవించారు. అడవులను దైవసమానంగా, నదులను జీవదాతలుగా, భూమిని ప్రత్యక్ష దైవంగా పూజించారు. కానీ, పారిశ్రామిక విప్లవం ఆవిర్భవించిన నాటి నుండి ఈ సమీకరణాలు తలకిందులయ్యాయి. సృష్టిని సంరక్షించాల్సిన మనిషే, దానిని ఒక వ్యాపార వస్తువుగా పరిగణించి ధ్వంసానికి ఒడిగట్టడం దారుణం.నేడు మనం ఎదుర్కొంటున్న పర్యావరణ విధ్వంసానికి అనేక ఉదాహరణలు స్పష్టమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి. నిత్యం అమూల్యమైన ప్రాణవాయువును అందిస్తూ ప్రపంచ ఊపిరితిత్తులుగా ఖ్యాతి గాంచిన అమెజాన్ సువిశాల వర్షారణ్యాలు వాణిజ్య పంటలు, పశువుల మేత మైదానాల కోసం దారుణంగా అగ్నికి ఆహుతవుతున్నాయి. మన దేశంలోనూ విస్తృత నగర విస్తరణ పేరుతో పచ్చని ప్రదేశాలు కాంక్రీటు అడవులుగా మారిపోతున్నాయి. జీవనదులైన గంగా, యమునలు పారిశ్రామిక వ్యర్థాల డ్రెయిన్లుగా మారడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హిమాలయ పర్వత శ్రేణుల్లో కరుగుతున్న మంచు చరియలు, గ్లేసియర్లు, అసాధారణంగా పెరుగుతున్న సముద్ర మట్టాలు, అకాల వర్షాలు భూతాపం యొక్క ప్రమాదకర హెచ్చరిక సంకేతాలు.మరోవైపు ప్లాస్టిక్ మహమ్మారి భూగోళాన్ని అతలాకుతలం చేస్తోంది. ఒక్కసారి మాత్రమే వాడి పారేసే (సింగిల్ యూజ్) పలాస్టిక్ వ్యర్థాలు భూమి పొరల్లోకి, సముద్ర గర్భంలోకి చేరి జీవజాలానికి ఉరితాడుగా మారుతున్నాయి. సముద్ర జీవులు, పక్షులు ప్లాస్టిక్ శకలాలను ఆహారంగా భావించి ప్రాణాలు కోల్పోతున్నాయి. చివరకు ఆ సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు (మైక్రోప్లాస్టిక్స్) ఆహార గొలుసు ద్వారా తిరిగి మనుషుల రక్తంలోకి, శరీరంలోకి చేరుతుండటం అత్యంత దిగ్భ్రాంతికరమైన అంశం.ఈ తరుణంలో అభివృద్ధి వద్దని ఎవరూ చెప్పడం లేదు. మానవాళి ప్రగతి సాధించాలి, పేదరికం నిర్మూలించబడాలి, జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అయితే ఆ అభివృద్ధి ప్రకృతిని బలిపీఠంపై ఎక్కించి సాధించేది కాకూడదని పర్యావరణ నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. ప్రకృత్యనుకూల, సుస్థిర అభివృద్ధి (సస్టైనబుల్ డెవలప్‌మెంట్) మాత్రమే మానవాళికి రక్షణ కవచం. సౌర విద్యుత్, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని విరివిగా పెంచడం, క్రిమిసంహారకాలు లేని సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వర్షపు నీటి సంరక్షణ విధానాలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయడం వంటివి తక్షణ ఆవశ్యకతలు.

మన పురాతన జీవన విధానంలో దాగి ఉన్న సాంప్రదాయ విజ్ఞానం నేటి సమాజానికి దిశానిర్దేశం చేయాలి. ఈనాటి అవసరానికి మాత్రమే వాడుకో, రేపటి తరానికి కొంత మిగిల్చి పో అనే మహోన్నత సూత్రం మన సనాతన సంస్కృతిలో భాగం. రైతులు భూమిని సాగు నిమిత్తం మాత్రమే కాక అమ్మలా పూజించేవారు. చెరువులు, కుంటలు ఊరి ఉమ్మడి ఆస్తిగా పరిరక్షించబడేవి. ఆనాటి పర్యావరణ హిత సూత్రాలను ఈనాటి నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించడమే సమగ్ర పరిష్కారం.పర్యావరణ సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వాలు, ఐక్యరాజ్యసమితి లేదా స్వచ్ఛంద సంస్థల బాధ్యత మాత్రమే కాదు. సమాజంలోని ప్రతి ఒక్క పౌరుడి ప్రాథమిక కర్తవ్యం. మన నిత్య జీవితంలో తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలు పర్యావరణంపై గుణాత్మక ప్రభావం చూపుతాయి. అనవసర కొనుగోళ్లను అదుపు చేసుకోవడం, ప్లాస్టిక్ కవర్లు, సీసాల వినియోగాన్ని పూర్తిగా విసర్జించడం, విద్యుత్, నీటిని పొదుపుగా వాడటం, ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి పోషించడం, వ్యక్తిగత వాహనాల కంటే ప్రజారవాణా వ్యవస్థను ఎక్కువగా వినియోగించడం వంటివి సమాజంలో పెను మార్పుకు నాంది పలుకుతాయి.పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులలో ప్రకృతి పట్ల మమకారాన్ని, బాధ్యతను నూరిపోయాలి. విద్యాసంస్థల్లో పర్యావరణ విద్యను కేవలం పుస్తక పాఠంగా కాకుండా, ప్రయోగాత్మక అభ్యాసంగా మార్చాలి. మొక్కలు నాటడం, వ్యర్థాల వర్గీకరణ, నీటి నిల్వ పద్ధతులపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దవచ్చు.

వర్తమానంలో సంభవిస్తున్న తుఫానులు, అనావృష్టి, అతివృష్టి, అకస్మాత్తుగా ఊడిపడుతున్న తుఫానులు, దావానాలు ప్రకృతి తల్లి ఇస్తున్న స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు. ఇప్పటికైనా మనం కళ్ళు తెరచి అత్యాశను పక్కనపెట్టి, అవసరాలకు మాత్రమే పరిమితమైతే ప్రకృతి తనే స్వయంగా పునరుజ్జీవం పొందుతుంది.భూగోళం మన పూర్వీకుల నుండి మనకు సంక్రమించిన ఆస్తి కాదు, రాబోయే భావితరాల నుండి మనం తీసుకున్న అప్పు మాత్రమే. ఆ అప్పును సురక్షితంగా, పచ్చగా, ఆరోగ్యకరంగా మరుసటి తరానికి అందజేయడం మనందరి నైతిక బాధ్యత. ప్రకృతి సంరక్షణ అంటే మానవజాతి ఆత్మరక్షణే అని గుర్తించి, సమతుల్య, సుస్థిర విధానాలను ఆచరణలో పెట్టడమే నేటి తక్షణ కర్తవ్యం.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


# ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు !

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే... పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ దానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠిచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది.నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

# రైతుల అవగాహన కార్యక్రమం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలంలో ప్రత్తి పంట సరియైన ఎదుగుదల లేకఇబ్బందికరంగాకార్యక్రమంఅలాగే వరి నార్లు పోసుకున్న రైతులు నాట్లు వేసుకోవడానికి వర్ష భావ పరిస్థితులు అడ్డంగా ఉన్నాయి.ఈ పరిస్థితుల దృష్ట్యా ఈరోజు మండల వ్యవసాయ అధికారి గుండ్రంపల్లి రైతు వేదిక లో రైతులకు అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది.. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ చిట్యాల మండలంలో రైతులంతా వరి నాట్లు బాగా తగ్గించాలని, వరికి బదులుగా క్రింద సూచించిన ప్రత్యామ్నాయ పంటల ను సాగు చేయవలసిందిగా కోరడమైనది.. ఈ క్రింది పంటలు తక్కువ నీటిని ఉపయోగించుకొని దిగుబడనిచ్చి ఈ వర్షాభావ పరిస్థితుల నుండి రైతులకు ఆదాయాన్నిచ్చే పంటలు.. కాబట్టి వీటిని వరి బదులుగా సాగు చేయాలని సూచించడమైనది.. కంది, పెసలు, మినుములు, ఉలవలు, అలసందలు, జొన్న, సజ్జలు, రాగి/రాగులు వంటి చిరుధాన్యాలు మరియు ఆముదం, పొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుశనగ వంటి నూనె గింజలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించడం మరియు సలహా ఇవ్వడం జరిగింది. ఇవి కాకుండా, రైతులకు స్వల్ప కాలికమైన కూరగాయలు వంకాయ, టమాటా మరియు గోకరకాయ మరియు బెండకాయ వంటి కూరగాయలు ఈ వర్షాభావ పరిస్థితులను తట్టుకొని ఆదాయం ఇచ్చే పంటలుగా సూచించడం అయినది.. ఈ కూరగాయలకు మంచి డిమాండ్ ఉన్నది కాబట్టి మార్కెటింగ్ కి ఎలాంటి ఇబ్బంది లేదని సూచించడం జరిగింది

... ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చిట్యాల మండలంలోని రైతులకు ప్రత్యేక సూచనలు చేస్తూ మన చిట్యాల మండలం జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మరియు అన్యధా ఫుడ్స్ ఆధ్వర్యంలో జనపనార సాగుకు పైలట్ మండలంగా సెలెక్ట్ అయిందని, కావున రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని జనపనార సాగును చేయాలని కోరడమైనది.. ఈ జనపనార పంట వరికి కావలసిన నీటిలో మూడో వంతు నీటితో పండుతుందని తెలియజేయడం జరిగింది.. అలాగే ఈ జనపనార పంటని అన్యధా ఫుడ్స్ వాళ్లు బైబ్యాక్ రూపంలో కొనుగోలు చేస్తారని, పంట అమ్ముకోవడంలో ఇబ్బందులు ఉండవని తెలియజేయడం జరిగింది.. ఈ జనపనార విత్తనాలు సబ్సిడీ రూపంలో రైతులకు అందజేయబడతాయని తెలియజేయడం జరిగింది.. కేవలం 180 రూపాయలకు ఎకరానికి సరిపోయే విత్తనాలను రైతులు పొందవచ్చు.. ఈ జనపనార పండించే రైతులకు అన్యధా ఫుడ్స్ వారు సమయానికి సాంకేతిక సలహాలు కూడా ఇస్తారు.. ఈ జనపనార విత్తనాలు మరియు సాంకేతిక సలహాల కోసం క్రింది వ్యక్తిని సంప్రదించవలసినదిగా కోరడమైనది.. అలాగే మరింత సమాచారం కోసం మీ దగ్గరలోని రైతు వేదికలలోని ఏఈఓ లను సంప్రదించవచ్చు.డాక్టర్. టి . పి. ప్రసన్న కుమారి డైరెక్టర్, అన్యధా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ( ఇంప్రూవ్మెంట్ పార్ట్నర్ - జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) 9121185151 అలాగే మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సహజ వ్యవసాయం (నాచురల్ ఫామింగ్) చేయటానికి గుండ్రంపల్లి మరియు సుంకనపల్లి రైతులు ముందుకు రావలసిందిగా కోరడం జరిగింది.. నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్ స్కీం కింద సహజ వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సాహకాలు లభిస్తాయని తెలియజేయడం జరిగింది.. సహజ వ్యవసాయం చేస్తున్న నాగలక్ష్మి మరియు గోపగోని కవిత, మైల నరసింహ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో ఉన్న లాభాలను మరియు ఛాలెంజ్లను రైతులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సుంకనపల్లి సర్పంచ్ , వార్డు మెంబర్లు, పి ఏ ఎస్ డైరెక్టర్ బొడిగె సైదులు, మండల వ్యవసాయ అధికారి పగిడిమర్ గిరిబాబు, ఏ ఈ ఓ నవీన్, రైతులు పాల్గొన్నారు

# గీత కార్మికుల పెండింగ్ ఎక్స్గ్రేషియాలను వెంటనే విడుదల చేయాలి

## జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్



**సంస్థాన్ నారాయణపురం,జూలై 22(క్రైమ్ మిర్రర్):** గీత కార్మికుల పెండింగ్లో ఉన్న ఎక్స్గ్రేషన్ వెంటనే విడుదల చేయాలని గీత పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా గౌడ సంఘం భవనంలో గీత కార్మికుల సంఘం మండల సమావేశాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటి చెట్టు పై పడి మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం చెందిన గీత కార్మికుల కుటుంబాలను వీధిన పడకుండా ఎక్స్గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఎక్స్గ్రియాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుందని వెంటనే విడుదల చేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గీత కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చిందని గీత కార్మికులకు మోపెడ్ వాహనాలు ఇస్తామని, వన పెంపకానికి ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఇస్తామని, నీరా ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఎక్స్గ్రేషియా చెల్లిస్తామని హామీ ఇచ్చిన ఏ ఒక్కటి అమలు నోచుకోలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం గీత పనివారాల సంఘం సభ్యత్వాల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తండా యాదయ్య, జిల్లా నాయకులు సుర్వి నరసింహ, వీరమల్ల యాదయ్య, మండల నాయకులు పెద్దగోని విష్ణు, ఉడుగు భీమయ్య, సుర్వి యాదయ్య, సుర్వి జంగయ్య, పొట్ట నరసింహ, సుర్వి ముత్యాలు, వీరమల్ల స్వామి, ఐటి పాముల అంజయ్య,ఉయ్యాల సత్తయ్య, పాలకూర్ల జంగయ్య, వీరమల్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

# రాహుల్, ప్రియాంక అరెస్టుపై కాంగ్రెస్ ఆగ్రహం

## మిర్యాలగూడలో భారీ నిరసన ర్యాలీ.. మోదీ దిష్టిబొమ్మ దహనం



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 22:** కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టుకు నిరసనగా మిర్యాలగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఆందోళన నిర్వహించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) నాయకత్వంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు.ర్యాలీ అనంతరం రాజీవ్ చౌక్లో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య విలువలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, ప్రతిపక్షాల గొంతును అణిచివేసే ప్రయత్నం చేస్తోందని నిరసనకారులు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహబూబ్ అలీ, చిరుమరి కృష్ణయ్య, డి. స్కైల్యాబ్ నాయక్, నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, బసవయ్య గౌడ్, చిలుకూరు బాలకృష్ణ, గుడిపాటి నవీన్, షేక్ అజ్జారుద్దీన్, ఇమ్రాన్, సిద్ధూ నాయక్, అంబటి సోమయ్య, వెంకటేష్ గౌడ్, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. ఆరిఫ్, నాగు నాయక్, వి. కాశయ్య, కౌన్సిలర్లు పుట్టపాక శ్రీనివాస్, షేక్ అబ్దుల్లా, గిరిధర్, మాజీ కౌన్సిలర్లు పాతూరు ప్రసాద్, ఎస్కే జానీలు పాల్గొన్నారు.నిరసన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వన్టౌన్, టూటౌన్ ఇన్స్పెక్టర్లు నాగభూషణరావు, సోమనర్సయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# విద్యార్థుల పేరిట కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలు

## బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ ..



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** పెగడపెల్లి:విద్యార్థి సంఘాలు తమ హక్కులను కాపాడుకోవడానికి ప్రభుత్వాలు వైఫల్యం చెందినప్పుడు నిరసనలు తెలియజేయడం సహజమని కానీ అందుకు భిన్నంగా విద్యార్థుల పేరిట గందరగోళం సృష్టించి రాజకీయం చేసి పబ్బం గడుపుకోవడానికి కాంగ్రెస్ ఇండి ఈ పార్టీలు రాజకీయ కుట్రలు చేస్తున్నాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజికి సంబంధించిన దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులైన వారిని కేంద్ర ప్రభుత్వం చట్టపరంగా శిక్షించడానికి జైల్లో వేయించిందని తర్వాత మళ్లీ పకడ్బందీగా నీట్ పరీక్ష నిర్వహించి ఒకపక్క కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు పూర్తి చేస్తుంటే ఇప్పుడు విద్యార్థుల పేరిట ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సందర్భంలో నిరసనలు తెలియజేసి ప్రపంచ దేశాల ముందు భారతదేశ పరువు తీయాలనే సంకల్పంతో విద్యార్థులు లేకుండానే నిరసనలు తెలియజేయడం సిగ్గుచేటని అన్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు సంఘ వ్యతిరేకులు రైతుల ముసుగులో పార్లమెంటు ముందు నిరసనలు చేయడానికి బయలుదేరడం కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం చేస్తున్న కుట్రలో బాగమేనని అన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడే వారైతే జంతర్మంతర్ దగ్గర జరిపిన నిరసన కార్యక్రమంలో 370 ఆర్టికల్ పునరుద్ధరిస్తామని అయోధ్య రామ మందిరంపై విచారణ జరగాలని జై పాలస్తీనా అంటూ పార్లమెంటును కూల్చేస్తామంటూ మోడీ గారిని కాల్చేస్తామంటూ భారతమాతకు మొగుళ్ళు ఎంతమంది అంటూ దేశద్రోహుల్లగా నినాదాలు చేసేవారు విద్యార్థులు కారని విద్యార్థుల ముసుగులో ఉన్న దేశద్రోహులని అన్నారు. నీట్ పరీక్ష జరుగుతున్న రోజు తన ప్రయాణం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే సదుద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు తన పర్యటనను రెండు గంటల పాటు విమానాశ్రయంలోనే వాయిదా వేసుకున్నారని కానీ అదే రోజున దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరుగుతుందని తెలిసి కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలియజేసి దేశవ్యాప్తంగా వేలాదిమంది నీట్ పరీక్ష రాసే విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీల అమలుకై బిజెపి పార్టీ కార్యకర్తలు రోడ్లపై నిరసనలు తెలియజేస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,మంత్రులు రోడ్లపై తిరుగుతారా అంటూ ప్రశ్నించారు. ధర్నాలో నీట్ పరీక్ష రాసిన వారు గానీ ప్రిపేర్ అయినవారు గానీ నీట్ పేపరు లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులు గానీ ఎవరూ లేరని కేవలం మోదీ గారికి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక మోదీ గారిని కేంద్ర ప్రభుత్వాన్ని బదునాం చేయడానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలో భాగమేనని అన్నారు.ఈసమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి బిజెవైఎం నాయకులు జక్కుల హరీష్, కాశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.




# హిందూ సమాజానికి బిజెపి క్షమాపణ చెప్పాలి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బిజెపి ర్యాలీలో శ్రీ ఆంజనేయ స్వామి వేషధారణతో ఉన్న వ్యక్తితో బిజెపి జెండా పట్టించి రోడ్డుపై డ్యాన్సులు చేయించిన బిజెపి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలంటూ రాష్ట్రీయ హిందూ ధర్మ రక్షణ సంస్థ డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ లక్నోలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతోత్సవ ర్యాలీలో సాక్షాత్తు హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీ ఆంజనేయ స్వామి వేషధారణతో ఉన్న వ్యక్తితో బిజెపి పార్టీ జెండా పట్టించి డ్యాన్స్ చేయించడం అత్యంత దారుణమని, ఇది కోట్లాది మంది హిందువుల విశ్వాసాలను, భక్తిభావాన్ని తీవ్రంగా అవమానించడమేనని, రాజకీయ కోసం దిగజార్చే ఇటువంటి చర్యలను హిందూ సమాజం ఎంతమాత్రం సహించదని, ఈ ఘోర అపచారానికి గాను బిజెపి నాయకత్వం వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలంటు రాష్ట్రీయ హిందూ ధర్మ రక్షణ సంస్థ తెలంగాణ స్టేట్ అధ్యక్షులు ఆంజనేయులు డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం మంత్రి హోదా వచ్చిన సందర్భంగా కలిసి నోట్ బుక్ లను అందజేసి శుభాకాంక్షలు తెలియచేసిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అంతటి రాజు ,గోలి ఆంజనేయులు ,బద్దం మల్లేష్, గోలి నరేష్ తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్ నిరసనగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీలోని కనకదుర్గమ్మ సెంటర్లో చిట్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎద్దులపూరి కృష్ణ ఆధ్వర్యంలో లోక్ సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్ తీవ్రంగా ఖండిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి. ఈ కార్యక్రమంలోచిట్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎద్దులపూరి కృష్ణ, చిట్యాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ పందిరి గీతా రమేష్,కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పోకల దేవదాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పార్టీ నర్సిరెడ్డి, కౌన్సిలర్ దేశపాక లతారాజేష్, నాగిళ్ల సుధాకర్, కో ఆప్షన్ బెల్లీ సత్తయ్య, ఇబ్రహీం, ఇమ్రాన్, కొసనం అశోక్,రుద్రవరం లింగస్వామి, ,మెట్టు మనోహర్,అమ్మరోజు మదన్, రెముడల నరసింహ, కళ్ళెం నరసింహ, మొబీన్,దాసరి వెంకన్న,దాసరి నరసింహ, సల్ల రాజు, శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ విధులకు ఆటంకం.... ఇద్దరి పై కేసు...



చందానగర్ క్రైమ్ మిర్రర్ : నల్లగండ్ల ఎస్బీఐ బ్యాంకు సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డా. శరత్ బాబు, అతని కుమారుడిపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, ఈ నెల 20న వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడగా, ఫుట్పాత్పై మూసుకుపోయిన మట్టిని హైడ్రా సిబ్బందితో తొలగించి నిల్వ నీటిని పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి మళ్లించే ప్రయత్నాన్ని నిందితులు అడ్డుకున్నారని, రోడ్డుపై నిలిచిన నీరు వెళ్లకుండా మట్టి వేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించారని పేర్కొన్నారు. అలాగే 22న కూడా ట్రాఫిక్ను సాధారణ స్థితికి తీసుకురావడానికి నిల్వ నీటిని తొలగించే ప్రయత్నం చేస్తుండగా నిందితుడు అక్కడికి వచ్చి అడ్డుపడటంతో పాటు గత మూడు రోజులుగా అధికారిక విధుల నిర్వహణకు ఆటంకం కలిగించాడని, నీటిని తొలగించేందుకు వచ్చిన హైడ్రా సిబ్బందిని కూడా విధులు నిర్వహించకుండా అడ్డుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజల భద్రత కోసం పోలీసుల క్షేత్రస్థాయి పర్యటన

**కుదురుపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు**

**ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి**

**నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చర్యలు**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలను బలోపేతం చేయడం, ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా మహాదేవ్‌పూర్ పోలీసులు కుదురుపల్లి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహాదేవ్‌పూర్ సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సుమారు 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కూడళ్లు, అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ భద్రతకు సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనదారులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నిబంధనలు పాటించని 8 వాహనాలపై జరిమానాలు విధించారు. అలాగే నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. గ్రామస్తులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, హెల్మెట్ వినియోగం, వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాల్సిన అవసరం, చట్టాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు వివరించారు. అదే విధంగా సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం, అనుమానాస్పద వ్యక్తుల సంచారం వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఏదైనా అనుమానాస్పద ఘటనలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తేనే గ్రామాల్లో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఇలాంటి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను జిల్లాలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.



## చర్లగూడెం భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు బీఎస్పీ పోరాటం ఆగదు: ఐతరాజు అభయేందర్


**మర్రిగూడ,జూలై 22(క్రైమ్ మిర్రర్):** డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భాగమైన చర్లగూడెం ప్రాజెక్టు వద్ద మర్రిగూడ మండల బీఎస్పీ అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఐతరాజు అభయేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐతరాజు అభయేందర్ మాట్లాడుతూ, చర్లగూడెం ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు 2013 భూసేకరణ, పునరావాసం మరియు పునర్నిర్మాణ చట్టం ప్రకారం పూర్తి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి అర్హ కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించడంతో పాటు, నిర్వాసిత కుటుంబాలకు చెందిన చదువుకున్న యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.ప్రాజెక్టు కోసం భూములు సేకరించి ఎన్నో సంవత్సరాలు గడిచినా పనులు పూర్తి కాకపోవడం గత, ప్రస్తుత ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులు ఇప్పటికీ న్యాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి బాధాకరమని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే భూ నిర్వాసితులు, రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించారని ఆరోపించిన ఆయన, ప్రజల సమస్యల పరిష్కారం కంటే మంత్రి పదవిపైనే ఎక్కువ దృష్టి పెట్టారని విమర్శించారు.మునుగోడు నియోజకవర్గం మొత్తం ఫ్లోరైడ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల ఆరోగ్యం, సురక్షిత తాగునీటి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.చర్లగూడెం భూ నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బహుజన్ సమాజ్ పార్టీ వారి పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఐతరాజు అభయేందర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్ట శివ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సుక్క రాములు, నారాయణపురం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల గిరి, చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షుడు మస్కు ఉదయ్, నాయకులు పల్లేటి రతివ, ఈద నరేష్, సురేష్, విజయ్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా బీరంగూడలో కాంగ్రెస్ ఆందోళన

**రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి: కాటా శ్రీనివాస్ గౌడ్**

**విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించదు: శశిధర్ రెడ్డి**

**కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు: కాంగ్రెస్ నాయకులు**







**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 22:** ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బీరంగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీరంగూడ డివిజన్ గుట్ట కమాన్ వద్ద అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధ చర్య" అని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు

**పీసీఆర్, పీఓఏ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి**

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**




**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 22:** పీసీఆర్, పీఓఏ చట్టాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం, పీసీఆర్, పీఓఏ చట్టాల అమలుపై సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో చోటుచేసుకునే ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అట్రాసిటీ ఘటనలను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని వాస్తవ ఘటనలను రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించి, వాస్తవమైన ప్రతి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, సహాయం, ఆర్థిక ఉపశమనం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు. 2022 నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 144 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఆర్థిక ఉపశమనం కింద సుమారు రూ.2.58 కోట్ల నిధులు అవసరమవగా, ఇప్పటివరకు రూ.1.74 కోట్ల నిధులు మంజూర య్యాయని తెలిపారు. అందులో 37 మంది బాధితులకు రూ. 68,87,500/- విడుదల చేసినట్లు, మిగిలిన అర్హులైన బాధితులకు ఆర్థిక ఉపశమనం అందజేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై జిల్లా కలెక్టర్ డీఎస్పీలను కేసుల వారీగా వివరాలు అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. 2026 జూన్ నెలాఖరు వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 31 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అందులో 12 కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రతి కేసులో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, చట్టప్రకారం సత్వర న్యాయం అందేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఏసీపీలు, డీఎస్పీలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, దేవుజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్ లో ఉత్తీర్ణత సాధించిన ఉప్పలపల్లి బాలుకు ఘన సన్మానం



**సంస్థాన్ నారాయణపురం, జూలై 22(క్రైమ్ మిర్రర్):** ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్ లో ఉత్తీర్ణత సాధించిన ఉప్పలపల్లి బాలు ని ధర్మ సమాజ్ పార్టీ నారాయణపురం మండల గౌరవ అధ్యక్షులు ఏర్పుల సురేష్, మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సామాజిక నాయకులు వీరమల్ల లింగస్వామి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉప్పల పెల్లి బాలు సాధించిన విజయం, అల్లందేవిచెరువు గ్రామానికి, యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ ప్రజలకు న్యాయం అందించే దిశగా సేవలందించాలని ఆకాంక్షించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఉప్పలపల్లి బాలు మాట్లాడుతూ, తనపై చూపిన అభిమానానికి ధర్మ సమాజ్ పార్టీ మండల గౌరవ అధ్యక్షులు ఏర్పుల సురేష్, సామాజిక నాయకులు వీరమల్ల లింగస్వామి కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు న్యాయ సేవలు అందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, గ్రామస్థులు పాల్గొని బాలు కి అభినందనలు తెలిపారు.



## 24 గంటల్లో చోరీ కేసు ఛేదన.. నిందితుడు అరెస్ట్

**దర్యాప్తు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 22: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగాపూర్ గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం. 87/2026గా బీఎన్ఎస్ సెక్షన్లు 331(3), 303(2) కింద కేసు నమోదు చేశారు. సంగాపూర్ గ్రామానికి చెందిన కాలిమెల్ల నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి సుమారు 20 తులాల వెండి పట్టీలు (రూ.11 వేల విలువ)తో పాటు రూ.25 వేల విలువైన శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం చోరీకి గురైన ఆస్తి విలువ రూ.36 వేలుగా నిర్ధారించారు. రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సమాచారం, సీసీటీవీ ఫుటేజ్, ఇతర సాక్ష్యాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో సంగాపూర్ గ్రామానికి చెందిన మడిగడ్డ బసవరాజ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి, కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసును వేగంగా ఛేదించిన ఎస్ఐ చైతన్య కిరణ్‌తో పాటు దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., అభినందించారు. అలాగే ప్రజలు ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

# అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడదాం..

## సామ్రాజ్యవాదంతో దేశాలపై విరుచుకుపడుతున్న అమెరికా ఎండి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు


**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 22(క్రైమ్ మిర్రర్):** అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య భవన్, భువనగిరిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ అధ్యక్షతన " అమెరికా సామ్రాజ్యవాదం - సవాళ్లు " అనే అంశంపై నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో జహంగీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అమెరికా తన సామ్రాజ్యవాద కాంక్షతో ఇతర దేశాలతో యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. యుద్ధం వల్ల అన్ని దేశాలపై ధరల ప్రభావం పడుతుందని చమురు ధరలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై భారాలు పడతాయన్నారు. సామ్రాజ్యవాద కాంక్షతో ఇతర దేశాలపై అధికారం చలాయించడం కోసం యుద్ధాలను ప్రేరేపిస్తూ ఇరాన్ ఇజ్రాయిల్ లాంటి దేశాలపై ప్రత్యక్ష దాడికి దిగుతూ దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని కుట్ర అమెరికా చేస్తుందని విమర్శించారు. అమెరికా చేస్తున్న యుద్ధంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాదం పెత్తనం దేశం మీద మరింత పెరుగుతుందని, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదాని, అంబానీ లాంటి సంస్థలకు రాయితీలను కల్పిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తూ నిరుద్యోగాన్ని పెంచుతూ, రైతాంగాన్ని దివాలా తీపిస్తూ తమ పరిపాలన సాగిస్తున్నాడని తెలిపారు. అమెరికా భారతదేశం మీద అనేక విధాలుగా సుంకాల పేరుతో పన్నులు పెంచుతున్న కనీసం నోరు






మెదపకుండా మోడీ ఉన్నారని, రష్యా నుండి చమురు కొనుగోలు చేయకూడదని ఆంక్షలు విధిస్తున్న మోడీ ప్రభుత్వం ఎలాంటి ఖండన ఇవ్వకపోవడం విడ్డూరమని వారు తెలిపారు. అదేవిధంగా మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి, నిరుద్యోగం పెరిగింది, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధానాలను తీసుకొచ్చి వ్యవసాయ కూలీల పొట్టగొట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తుందని దీనికి తోడుగా గ్రామాలలో 125 రోజులు పని కల్పిస్తున్నామని తప్పుడు ప్రచారాలు చేసుకుంటుందని వారు అన్నారు. రానున్న కాలంలో ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే ప్రయత్నం బిజెపి చేస్తుందని, అదేవిధంగా విద్యుత్ సవరణ బిల్లును తీసుకొచ్చి పేదవాడికి విద్యుత్ భారాన్ని మరింత పెంచే విధంగా మోడీ ప్రభుత్వ విధానం ఉందని, పేద మధ్యతరగతి ప్రజలకు ఇవ్వని రాయితీలు పెట్టుబడుదారులకు కాంట్రాక్టర్లకు ఇస్తున్నాడని వారు అన్నారు. గతంలో నల్ల చట్టాలను తీసుకురావడం రైతుల పోరాటంతో రైతాంగానికి మద్దతు ధరను ఇస్తామని చెప్పి నూతనంగా విత్తన చట్టాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాడని దీని ద్వారా వ్యవసాయ రంగం దివాళ తీసే అవకాశాలు ఉన్నాయని వారు అన్నారు. కార్మికుల పొట్టకొట్టే లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మిక వర్గంపై మరింత పని ఒత్తిడిని పెంచాలని బిజెపి చూస్తుందని వారన్నారు. బీహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు చేసి అధికారంలోకి రావడం జరిగిందని ఇదే పనిని ఇతర రాష్ట్రాలలో చేయాలనే ప్రయత్నం బిజెపి చేస్తుందని సిబిఐ, ఈడిని తన గుప్పెట్లో ఉంచుకొని రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని తప్పుడు ఆర్థిక విధానాలు అనుసరిస్తూ మతోన్మాదాన్ని పెంచడం లాంటి పనులు బిజెపి చేస్తుందని అన్నారు. వీరితోపాటు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, మల్లారెడ్డి, చిన్నయ్య, బట్టు రామచంద్రయ్య, శ్రీనివాసచారి పాల్గొని మాట్లాడగా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు మాయ కృష్ణ, దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేష్ మండల కార్యదర్శులు పల్లెర్ల అంజయ్య, పోతరాజు జహంగీర్, రేఖల శ్రీశైలం, బండారు శ్రవణ్, నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియ రాజు, బుర్రు అనీల్, గంధమల్ల మాతయ్య , అన్నంపట్ల కృష్ణ , ఏదునూరి మల్లేష్, కొండమడుగు నాగమణి, కొత్త లలితా తదితరులు పాల్గొన్నారు.





# పాపిరెడ్డి నగర్ లో అక్రమ వాటర్ ప్లాంట్ ల పై అధికారుల కొరడా

## హర్షం వ్యక్తం చేసిన కాలనీ కమిటీ అధ్యక్షులు చంద్రారెడ్డి

**కూకట్ పల్లి జూలై 22 (క్రైమ్ మిర్రర్) :** ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ లో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లను బుధవారం అధికారులు సీజ్ చేశారు. తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన శరత్ కుమార్ ఆదేశాల మేరకు అధికారులు అక్రమ వాటర్ ప్లాంట్లకు నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా అక్రమ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇదే పద్ధతి పునరావృతమైతే చట్టపరంగా జైలు శిక్ష తప్పదని తెలిపారు.

**అధికారుల చర్యలపై హర్షం వ్యక్తం చేసిన కాలనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి**

గత కొంతకాలంగా కాలనీ కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. వాటర్ ప్లాంట్లను సీజ్ చేసి భూగర్భ జిల్లాల రక్షణ కోసం కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భూగర్భ జలాలను భావితరాలకు అందించవలసిన బాధ్యత అందరిపై ఉంటుందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అరకపూడి గాంధీ సహకారంతో బస్తీ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భగవంతు రెడ్డి, నరసింహులు ముదిరాజ్, సిహెచ్ సత్యనారాయణరెడ్డి, బాల్ రెడ్డి, తాటి కిరణ, పి శంకర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్, వీరబాబు, సుజిత్, శివ, ప్రకాష్ రెడ్డి, వసీం, వనం ఆంజనేయులు, అరుణ లక్ష్మి, లక్ష్మమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవు..

## ట్రెస్మా నాయకులకు మల్కాజిగిరి సిపి సుమతి హామీ

**కుత్బుల్లాపూర్, జూలై 22 (క్రైమ్ మిర్రర్):** ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై బెదిరింపులకు పాల్పడితే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ట్రెస్మా నాయకులకు హామీ ఇచ్చారు. బుధవారం ప్రైవేట్ పాఠశాల పై జరుగుతున్న దౌర్జన్యాలను నిరోధించాలని కోరుతూ ట్రెస్మా నాయకులు పోలీస్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల పేరుతో, కుల సంఘాల పేరుతో, ఆర్టిఐ యాక్టివిస్టుల పేరుతో పాఠశాల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ట్రెస్మా నాయకులు కమిషనర్ సుమతి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆమె సంఘాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసిన వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సంఘం సభ్యులకు సూచించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాల యజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు, ఉప్పల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కిరణ్ కుమార్ రెడ్డి, ఉపేందర్, పాఠశాల కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్న



## వాంగుచుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడం బాధాకరం

## కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 22(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలో ప్రెస్ మీట్ లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ స్వయంగా విద్యార్థుల పక్షాన నిరసనకు దిగారు.శాంతియుత మార్గంలో నిరసన వ్యక్తం చేస్తే విద్యార్థుల మీద లాటిఛార్జి చేయడాన్ని రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నా.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రాహుల్ గాంధీ ప్రధాని చేయడానికి కాంగ్రెస్ పార్టీ కాపాడడానికి సైనికుల్లాగా పని చేస్తారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన ప్రభుత్వమే వారి పైన చర్యలు తీసుకోవడం బాధాకరం.వాంగ్ చుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడం మంచి పద్ధతి కాదు రాహుల్ గాంధీ రెస్ట్ ని తీవ్రంగా ఖండిస్తున్నాం.పాత కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యతను ఏఐసిసి ఇంచార్జ్,పిసిసి అధ్యక్షులు తీసుకుంటే మంచిదనేది నా అభిప్రాయం.అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి. గెలిపించిన కార్యకర్తలని అధికారంలోకి వచ్చాక వాళ్ళ పైన కేసులు పెట్టడం బాధాకరం. కెసిఆర్ ని గద్దె దించడానికి చాలామంది కార్యకర్తలు లాటి దెబ్బలు తిన్నారు. ఇతర పార్టీ నుంచి వచ్చిన వాళ్లది ఒకటే పార్టీ వాళ్లది రూలింగ్ పార్టీ దేశం మొత్తం రాహుల్ గాంధీ వైపు చూస్తోంది ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సి ఉంది దానికోసం రాత్రింబవుళ్ళు రాహుల్ గాంధీ కష్టపడుతున్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకత్వంపై ఉన్నది.

# ప్రజా సేవలో "ఎండీఆర్ ఫౌండేషన్" ముందుంటుంది మాద్రి పృథ్వీరాజ్

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎండీఆర్ ఫౌండేషన్ కృషి

### బీఎల్ఓలు, ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎం సిబ్బందికి బ్యాగులు, గొడుగుల పంపిణీ



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 22:** ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రతి ఓటరికి, బీఎల్ఓలకు అండగా నిలుస్తూ ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-- రెండువేల ఇరవై ఆరు సందర్భంగా బీఎల్ఓలుగా సేవలందిస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, ఏఎన్ఎం సిబ్బందికి బ్యాగులు, గొడుగులను అందజేశారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్న బీఎల్ఓలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, ఏఎన్ఎం సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. ప్రతి పౌరుడు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. తమ సేవలను గుర్తించి ప్రోత్సహించిన మాద్రి పృథ్వీరాజ్‌కు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. "మీ ఓటు -- మీ హక్కు.. మీ పరిరక్షణ -- మా బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# హత్య కేసు విచారణ భయంతో యువకుడు ఆత్మహత్య



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 22: పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో బీహార్ రాష్ట్రానికి చెందిన అంకిత్ కుమార్ (22) ఉరివేసుకుని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అంకిత్ కుమార్‌పై ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసు విచారణ కొనసాగుతోంది. ఆ కేసులో శిక్ష పడుతుందనే భయం, న్యాయవాది ఫీజు చెల్లించలేని ఆర్థిక ఇబ్బందుల కారణంగా అతడు తీవ్ర మనస్తాపానికి గురైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. జూలై 21న కోర్టుకు హాజరు కావాల్సి ఉండగా, కోర్టుకు వెళ్లకుండా తన తల్లి కూలీ పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో చీరతో సీలింగ్ రాడ్‌కు ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి కిరణ్ దేవి ఫిర్యాదు మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# శంషాబాద్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

## యువ డ్రైవర్ మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గూడూరు గ్రామానికి చెందిన ఎస్. అజయ్ కుమార్ (31) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు వెళ్తున్నట్లు తన కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం తన స్నేహితుడు కేతావత్ ప్రసన్న కుమార్ అలియాస్ చరణ్ (29)తో కలిసి అతని స్విఫ్ట్ కారు ఎపి29బిపి0081లో మద్దూరు గ్రామంలోని బీకే తండాకు వెళ్లారు. అక్కడి నుంచి రాత్రి తిరుగు ప్రయాణంలో ప్రసన్న కుమార్ కారు నడుపుతుండగా, అజయ్ కుమార్ ముందు సీటులో కూర్చున్నాడు. బుధవారం ఉదయం సుమారు 5:10 గంటల సమయంలో శాద్‌నగర్ నుంచి శంషాబాద్ వైపు వస్తుండగా, ఘన్సీమియగూడ గ్రామ పరిధిలోని అమిటీ పార్క్ సమీపంలోని ఎన్‌హెచ్-44పై కారు అదుపు తప్పింది. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ముందు వెళ్తున్న టిఎన్30బికె7830 నంబర్ గల లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్ కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న ప్రసన్న కుమార్‌కు తలతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అతను తొండుపల్లిలోని లిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చలో సంసద్‌పై పోలీసుల లాఠిన్యం

## అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ

న్యూఢిల్లీ,జులై22: కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు దిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 గురువారం 23-7-2026



## హరితహారంతో పచ్చదనం పెంపొందించాలి: రూరల్ ఎస్ఐ యాకూబ్

**కోదాడ జులై 22 క్రైమ్ మిర్రర్ :** మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా కోదాడ రూరల్ ఎస్ఐ శ్రీ ఎస్.కే. యాకూబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ యాకూబ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ మందుల నాగయ్య, సొసైటీ చైర్మన్ శ్రీ ఊరుగంటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీ జయసింహారెడ్డి, వార్డు సభ్యులు, కానిస్టేబుల్ శ్రీ సీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## పోక్సో కేసులో మూడేళ్ల జైలు.....

**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు కపరపు బాబురావుకు రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది. క్రైమ్ నంబర్ 1090/2020, సెషన్స్ కేసు నంబర్ 143/2021లో ఐపీసీ సెక్షన్ 354-ఏ, పోక్సో చట్టం సెక్షన్ 7 చదవబడిన 8 కింద విచారణ జరిపిన కోర్టు బాధితురాలికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశించింది. ఈ కేసులో బి. వెంకటేశ్వర్ రెడ్డి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాదనలు వినిపించగా, డబ్ల్యూఎస్ఐ కె. హారిక దర్యాప్తు నిర్వహించారు. మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ కె.వి. సుబ్బారావు పర్యవేక్షణలో కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను సకాలంలో హాజరుపరచడంతో నిందితుడికి శిక్ష పడింది. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో పోలీస్ శాఖ సున్నా సహనంతో వ్యవహరిస్తుందని, ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌ఓ కె.వి. సుబ్బారావు తెలిపారు.

## ఆత్మకూరు(ఎం)మండల యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీ విద్యార్థుల అక్రమ అరెస్టుకు నిరసనగా ధర్నా కార్యక్రమం



**ఆత్మకూరు(ఎం),జూలై 22/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు వద్ద ఆత్మకూరు మండల యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులు శాంతియుతంగా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తుంటే పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి అక్రమంగా అరెస్టు చేయడం జరిగింది. రాహుల్ గాంధీ విద్యార్థులకు మద్దతుగా మోడీ నివాస ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తుంటే అక్రమంగా అరెస్టు చేయడం జరిగింది.వీటికి నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాని వెంటనే రాజీనామా చేయాలని యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చిత్తర్ల అనిల్ గౌడ్, ఎన్ఎస్యూఐ ప్రెసిడెంట్ యాస సుభాష్ రెడ్డి,జిల్లా కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాష బోయిన నవీన్,బీసీ సెల్ మండల అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ ఎలగందుల మహేష్, టౌన్ యూత్ కాంగ్రెస్ గుండెగాని కిరణ్ గౌడ్,ఎన్ఎస్యూఐ ప్రెసిడెంట్ లోడి మహేష్, యూత్ కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షులు యాస మురళి, వార్డు సభ్యులు బూడిద శేఖర్, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ఉగ్గే నరేష్, బూత్ అధ్యక్షులు ఎండి మజీద్, తవిటి రాజు,లోడి రాజు మరియు యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్యూఐ సభ్యులు తవిటి రాజు,విద్యాసాగర్, రాచమళ్ళ ప్రసాద్, గడ్డం హరీష్,గణేష్,సురేందర్,కోరే హరీష్ ,కోల మనోజ్ ,మహేష్, వేముల నవీన్, పైళ్ల మహేష్, చేపూరి సోమేశ్వర సాయి, కందడి మధు,ఎలాగందుల పవన్, దీగోజు భరత్ ,ప్రమోద్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ లో మాంగళ్య షాపింగ్ మాల్ 33వ శాఖ గొప్ప ప్రారంభం





**కోదాడ జులై 22 ( క్రైమ్ మిర్రర్ ):** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది.ఈ క్రమంలో కోదాడ లో 33 శాఖను గొప్పగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి ఆషికా రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.రిబ్బన్ కటింగ్ అనంతరం నటి ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ, కోదాడ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉంది. వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యురాలు నాలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుసుమ వెంకట రత్నం బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నరు మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ:ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం" అని తెలిపారు. ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు.మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ మాల్ ప్రారంభంతో కోదాడ ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చు.రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందింది.ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు.దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోంది. కోదాడ ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ కోరారు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

### అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులు, గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తాం: టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ షాబాద్,జూలై 22:** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డులు, కార్పొరేట్ వైద్యం అందించే ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ, కుటుంబాలకు భరోసా కలిగించే గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) అమలు వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టులు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా మాట్లాడుతూ, మండల స్థాయి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ నియోజకవర్గ, మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేస్తున్నామని చెప్పారు.జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు జరిగినా, అక్రమ కేసులు నమోదు చేసినా యూనియన్ వెంటనే స్పందించి లీగల్ సెల్ ద్వారా పూర్తి న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నియోజకవర్గంలో జర్నలిస్టుల కోసం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, త్వరలో చేవెళ్ల నియోజకవర్గంలో కూడా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, సూర్యనారాయణ, రమేష్, ఈసీ సభ్యుడు ఇలియాజ్ షరీఫ్, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిమోని యాదయ్య, షాబాద్ మండల మాజీ అధ్యక్షుడు పోనమోని రమేష్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ టీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

షాబాద్ మండల టీయూడబ్ల్యూజే నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దర్పల్లి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏగూరి మల్లికార్జున్, గౌరవ అధ్యక్షుడిగా నాగని రామచంద్రయ్య ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా కడమంచి నర్సింలు, ఉప్పు శ్రీనివాస్, పోనమోని వెంకటేష్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా బర్క నరేందర్, ముక్కు లక్ష్మణ్, జానంపేట శివరాజ్ గౌడ్, కోశాధికారిగా పూర్ణచందర్ గుప్తా, ఈసీ సభ్యులుగా చిలకమర్రి అనిల్, రాజేష్, మధు, రాజేందర్, రవి ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

### పిఎన్ఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల సదానంద్ పిలుపు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఈనెల 28, 29, 30 తేదీలలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గార్లలో జరిగే ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులలో కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల సదానంద్, జిల్లా అధ్యక్షులు నామ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ క్రాస్ రోడ్ లోని తమ్మినేని సుబ్బయ్య భవన్లో ప్రజానాట్యమండలి పాలేరు డివిజన్ కమిటీ సమావేశం అధ్యక్షులు మారుతి కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సదానంద్, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాదం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు, రైతులు, ప్రజలందరినీ చైతన్యవంతం చేయడంలో ప్రజానాట్యమండలి కళాకారులు విస్తృతమైన కళారూపాలను ప్రదర్శించాలన్నారు. సమాజంలో పాశ్చాత్య విష సంస్కృతి ప్రభావంతో విద్యార్థులు, యువత పక్కదారి పడుతూ తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. విద్యార్థులు,నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలక ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ఫలితంగా యువత చెడు వ్యసనాలకు బానిసలై కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న అసమర్థ విధానాల ఫలితంగా రోజురోజుకు మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో నానాటికి పెరిగిపోతున్న ఆకృత్యాలు, హింసాత్మక ఘటనలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న అసమర్థ విధానాలపై ప్రజలను నిత్యం చైతన్యవంతం చేయడంలో ప్రజానాట్యమండలి కళాకారులు కీలక భూమిక పోషించాలన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కళారూపాలను తయారు చేసి నిత్యం ప్రజల వెన్నంటే ఉంటూ వారి సాధక బాధలను కళారూపాలతో కళ్ళకు కట్టినట్లుగా ప్రదర్శించి ఉద్యమ బాట పట్టించాలన్నారు. ఈనెల 28, 29, 30 తేదీలలో గార్లల్లో జరిగే రాష్ట్ర స్థాయి పాటల శిక్షణ తరగతులలో ప్రపంచవ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాద ప్రభావం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పాటల రూపంలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కళాకారుల శిక్షణా తరగతుల ద్వారా సమాయత్తమవుతున్నట్లు వారు తెలిపారు. రానున్న కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా తర్ఫీదు పొందిన కళాకారులచే ప్రజా సమస్యలపై కళారూపాలను ప్రదర్శించి ప్రజలను చైతన్యవంతం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఢిల్లీలోని జంత్ర మంత్ర వద్ద విద్యార్థులు యువతపై జరిగిన లాటిచార్జ్ కు వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ పాటల రూపంలో నినదించారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి పాలేరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మారుతి కొండలరావు, నందిగామ కృష్ణ, ఉపాధ్యక్షులు దేగల వెంకటేశ్వరరావు, శానం వీరబాబు, గుండమల్ల ఉపేందర్, పాపాచారి, కాల్వ కోటేశ్వరరావు, గాదె వెంకటేశ్వరరావు, మల్లయ్య, లింగయ్య, రాంబాబు, గురవయ్య, ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొల్లోజు శివకుమార్ నియామకం

**ఆత్మకూరు(ఎం),జూలై22/క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ఉద్యమకారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ విద్యార్థి నాయకుడుయాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కొల్లోజి శివకుమార్ ని తెలంగాణ ఉద్యమకారుల సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు పూస శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నియామక పత్రాన్ని శివకుమార్ కి అందించడం జరిగింది.ఈ సందర్భంలో శివకుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులకు మరియు ఉద్యమకారుల సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమకారుల యొక్క అభ్యున్నతికి మరియు తెలంగాణ ఉద్యమకారుల సంఘం బలోపేతనికి తోడ్పడుతానని తెలియజేయడం జరిగింది.



# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో అర్హత ఉన్న ప్రతి ఓటరు నమోదయ్యేలా చర్యలు: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### వంద శాతం డిజిటలైజేషన్ కోసం ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలి

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ రోల్ లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు ఆగస్టు, 3 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 3 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, ఆగస్టు 10 న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, అక్టోబర్ 8 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 12 న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు, 12,43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 10,15,693 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. ఇది 81.66 శాతం పురోగతికి సమానమని, ఇంకా 2,28,088 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా



విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారులు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీచేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 12 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి కావాలంటే ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వీలైనంత ఎక్కువ మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా అందరూ కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కాని ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభమవుతుందని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు మంకెన రమేష్, కె. వెంకట్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ(ఎం) పార్టీ ప్రతినిధి నెల్లూరి వీరబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏదుల మండల కుమ్మర సంఘం యూత్ అధ్యక్షులుగా ఏకగ్రీవం ఎన్నిక

### అధ్యక్షులుగా గుణగంటి వెంకటేష్

### ప్రధాన కార్యదర్శిగా, సుగురు రాములు

**వనపర్తి జులై 22: క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షులు నడికుడి జయంతి రావు పిలుపుమేరకు, వనపర్తి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు సూగురు రాములు,ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు నరసింహులు సుగురు నరసింహ. బొడ్డుపల్లి నరసింహ. ఏదుల మండల్ అధ్యక్షుడు రాముడు. ఆధ్వర్యంలో బుధవారం రోజు ఏదుల మండలం సంబంధించిన గ్రామాల కుమ్మరి సంఘం నాయకులు అభిప్రాయం సేకరణతో ఎదుల మండలం కుమ్మర సంఘం యూత్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా గుణగంటి వెంకటేష్,ప్రధాన కార్యదర్శిగా, సూగురు రాములు,గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసులు,



ఉపాధ్యక్షులుగా సుగురు ఆంజనేయులను ఏకగ్రీవంగా, నియమించారు. పదవులను బాధ్యతయుతంగా భావించి, గ్రామ,మండల స్థాయిలో కుమ్మరి సంఘం బలోపితం చేయడానికి అందరం ఐక్యతతో కలిసి కావలసిన హక్కుల సాదరికత తోడ్పాటుగా కుమ్మరి సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి కొరకు ప్రతిష్టమైన బాధ్యత తీసుకుంటామని,నూతన నాయకత్వం కుమ్మరి యూత్ సంఘం పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, జిల్లా స్టీరింగ్ కమిటీ ఈ సమావేశంలో మాట్లాడుతూ,, కుమ్మర్లు ఏకాభిప్రాయంతో ఏదైనా సాధించవచ్చన్నారు,మనలో ఐక్యత లేకుంటే, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మర్ల సంఖ్యా బలాన్ని గుర్తించకపోవడం. మనలో ఐక్య లేకపోవడంవల్లే ,,కుమ్మర్లు అట్టడుగున ఉండిపోయమన్నారు.గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అయితే, ఎంత నిజమైతే, కుమ్మర్లు గ్రామ దేవతల నుండి, రాష్ట్రంలో గోల్కొండ ఖిల్లా అమ్మవారికీ,శ్రీశ్రీశ్రీ కనకాల కట్ట మైసమ్మ అమ్మవారి వరకు కుమ్మరి మట్టితో తయారు చేసి,తొలి బోనంగా, కుమ్మర్లు ధూప దీప,నైవేద్యం అమ్మవారికీ సమర్పిస్తారనారు. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన కుమ్మర్లను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చట్టసభల్లో కుమ్మర్లను రాణించాలని ప్రభుత్వాలకు కుమ్మర్లు ఆకాంక్షతొ పిలుపునిచ్చారు ఈ సమావేశంలో జిల్లా కుమ్మర సంఘం నాయకులు, ఏదుల మండల సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ బిఆర్టీయు ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా సత్తార్ మియా నియామకం

### ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి --షేక్ సత్తార్ మియా

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు రాంబాబు యాదవ్ రాష్ట్ర నాయకులు నారాయణ పాల్గొనగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆటో కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తూ కార్మికుల పక్షాన పోరాడుతున్న సత్తార్ మియా ని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర నాయకత్వం నియమించింది.

నియామక పత్రాన్ని అందుకున్న అనంతరం సత్తార్ మియా రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఖమ్మం




జిల్లాలోని ప్రతి ఆటో కార్మికుడి సమస్య పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుందని అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరం రూ.12,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. అలాగే ఉచిత బస్సు పథకం అమలుతో ప్రజలకు కొంత ప్రయోజనం కలిగినప్పటికీ వేలాది మంది ఆటో కార్మికుల ఆదాయం తీవ్రంగా తగ్గిపోయిందని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులు ఫైనాన్స్ వాయిదాల భారంతో అనేక మంది ఆటో కార్మికులు అప్పుల పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కొంతమంది ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యలకు కూడా పాల్పడిన సంఘటనలు బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం ఖమ్మం విచ్చేసిన సత్తార్ మియా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి తనకు ఈ బాధ్యతలు అప్పగించేందుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పుప్పాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### వాటర్ ట్యాంకర్ ఢీకొని వడ్రంగి మేస్త్రీ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ టోల్ గేట్ సమీపంలో మంగళవారం రాత్రి దారుణ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ బైక్‌ను వెనుక నుండి బలంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బందా జిల్లాకు చెందిన సుశీల్ కుమార్ (28), సురేష్ అనే వ్యక్తులు కాటేదాన్ పరిధిలోని లక్ష్మిగూడలో నివాసముంటూ వడ్రంగి (కార్పెంటర్) పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హాఫీజ్‌పేట్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో పని ముగించుకుని, తమ హోండా షైన్ మోటార్ సైకిల్ ఎపి28డివి3174 పై తిరిగి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో పుప్పాలగూడ టోల్ గేట్ సమీపంలోకి రాగానే వెనుక నుండి అతివేగంగా, అత్యంత నిర్లక్ష్యంగా వచ్చిన ఒక వాటర్ ట్యాంకర్ టిఎస్34టి1819 వీరి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి బైక్ వెనుక కూర్చున్న సుశీల్ కుమార్ (28) అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బైక్‌ను ఢీకొట్టిన అనంతరం కూడా సదరు వాటర్ ట్యాంకర్ డ్రైవర్ రంజిత్ సింహ్ తన నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను కొనసాగించి, రోడ్డుపై వెళ్తున్న ఒక







కారు టిఎస్13యుడి1330, మరొక స్కూటీ (ఏపి39కెడబ్ల్యూ6742)లను కూడా వరుసగా ఢీకొట్టాడు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు



# డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన సర్పంచ్ బిసు ధనలక్ష్మి

**ఆత్మకూరు(ఎం),జూలై22/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో శివాలయం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ బీసు ధనలక్ష్మి,ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీసు ధనలక్ష్మి మాట్లాడుతూ,రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని,ఎలాంటి లోపాలకు తావు లేకుండా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే పనుల సమయంలో ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంగునూరు రమేష్, పైళ్ళ బుచ్చిరెడ్డి, యాస కృష్ణారెడ్డి, ఎలగందుల శ్రీనివాస్, మాద నరసయ్య, సిగ వీరస్వామి, కొమ్మరాజుల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీకి మద్దతు తెలిపిన సేవాదళ్ నాయకులు పిట్టల బాలరాజ్

### శ్రీ జయరామ్ ఆశ్రమంలో నిర్బంధం



**ఆత్మకూరు(ఎం),జూలై22/క్రైమ్ మిర్రర్:** దేశ రాజధాని న్యూఢిల్లీలో నీట్ పేపర్ లికేజీ అంశంపై ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పార్లమెంటు ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ కరిగే,డీకే శివకుమార్ సీఎం,ఎంపీ ప్రియాంక గాంధీలను అక్రమ అరెస్టులను తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు తీవ్రంగా ఖండించారు. నిరసనగా ఢిల్లీలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి రాహుల్ గాంధీకి శ్రీ జయరాం ఆశ్రమం చౌక్ నుండి కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీకి మద్దతుగా వెళుతున్న క్రమంలో నిర్బంధముతో ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని నీట్ పేపర్ కు కారణమైన విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ నాయకత్వంలో ఢిల్లీకి బయలుదేరడం జరిగింది. రాష్ట్ర మహిళా సేవాదళ్ అధ్యక్షురాలు సంగీత,జనగాం జిల్లా రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రెటరీ సుంకర శ్రీనివాస్ రెడ్డి, ఆదినారాయణ, సత్యనారాయణ,కిషన్, శ్యామల రవీందర్,దరిపల్లి ప్రవీణ్,గుమ్మడవెల్లి రమేష్, అంకం రాజేష్,డాకూర్ ప్రకాష్, భువనగిరి పట్టణ అధ్యక్షులు, తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

# ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ఎమ్మెల్యే

### సీఎంఆర్ఎఫ్ 2.50 రూపాయల ఎల్ఓసి అందజేత

### మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి జులై 22 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన ఎరుకలి చౌడమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని కోరింది. దీనిపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంటనే స్పందించి, రూ. 2,50,000 వేల రూపాయల విలువైన





సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ ని మంజూరు చేయించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ బుధవారం ఎల్‌వోసీ పత్రాన్ని బాధితురాలు ఎరుకలి చౌడమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో ఎమ్మెల్యే ముందుంటారని కొనియాడారు. సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ ద్వారా పేదలకు పెద్ద ఆసుపత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు.?ఆపద సమయంలో రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేగారెడ్డికి, అందజేసిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంతం దయాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, మాజీ సర్పంచులు వెంకటేష్ సాగర్ సురేందర్ గౌడ్ బుర్రమౌని రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 గురువారం 23-7-2026

# గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో ఖమ్మం అభివృద్ధి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..ఆగస్టు 1 నుంచి ఖమ్మం నగర ట్రాఫిక్‌కు భారీ ఉపశమనం

దంసలాపురం కల్లూరు సత్తుపల్లి వద్ద ప్రజల కోసం ప్రత్యేక ఎగ్జిట్లు ఏర్పాటు

ఖమ్మం--అశ్వారావుపేట నాలుగు లైన్ల జాతీయ రహదారికి కేంద్రం సూత్రప్రాయ ఆమోదం వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలి

జాతీయ రహదారుల అనుసంధానంతో ఖమ్మానికి ఔటర్ రింగ్ రోడ్ తరహా వ్యవస్థ

దంసలాపురం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఆర్‌ఓబీ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పూర్తయితే ఖమ్మం జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ఆగస్టు 1 నుంచి ఖమ్మం వైరా సత్తుపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి దంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి అసలు ప్రణాళికలో దంసలాపురం వద్ద ఎగ్జిట్ లేకపోయినా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దంసలాపురం కల్లూరు సత్తుపల్లి వద్ద ప్రత్యేక ఎగ్జిట్లు తీసుకొచ్చామని తెలిపారు. దంసలాపురం ఎగ్జిట్ రైల్వే వంతెన ఆధారంగా నిర్మించబడిందన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ రహదారిపై వాహనాల రాకపోకలు ప్రారంభమైతే ఖమ్మం వైరా సత్తుపల్లి ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. ఏలూరు తూర్పు గోదావరి పశ్చిమ గోదావరి వైపు వెళ్లే దాదాపు 90 శాతం వాహనాలు ఈ జాతీయ రహదారినే వినియోగిస్తాయని తెలిపారు. ప్రజలకు ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భవిష్యత్తులో పరిశ్రమలు వాణిజ్యం ఉపాధి అవకాశా లకు పెద్ద ఎత్తున దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ రహదారి ద్వారా రాజమండ్రికి కేవలం రెండు గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవే కావడంతో జంతువులు ఆటోలు అనధికార క్రాసింగ్‌లు వంటి అంతరాయాలు లేకుండా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. అమరావతి నుంచి భద్రాచలం మీదుగా జగదల్‌పూర్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి ప్రతిపాదన ఉందని తెలిపారు. మణుగూరు నుంచి ఏటూరునాగారం మీదుగా నాగపూర్ వెళ్లే జాతీయ రహదారి కూడా రానుందని చెప్పారు. కరీంనగర్-- వరంగల్ నుంచి అమరావతికి వెళ్లే రహదారి పనులు కొనసాగుతున్నాయని భూసేకరణ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఆలస్యం జరుగుతోందన్నారు. ఖమ్మం--అశ్వారావుపేట రహదారిని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కి అప్పగించామని నాలుగు లైన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వెంటనే డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం ప్రవేశం నుంచి అశ్వారావుపేట వరకు ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం మార్కింగ్ పూర్తి చేసి రహదారి పక్కన ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. తాను మంత్రి అయినప్పుడు ఖమ్మం జిల్లాలో ఒక్క సెంటీమీటర్ జాతీయ రహదారి కూడా లేదని ప్రస్తుతం అన్ని దిశల్లో జాతీయ రహదారులు అభివృద్ధి చెందడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. సమన్వయంతో అమరావతి రహదారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి జిల్లా పరిధిలో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కామాంచికల్ మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డును పొన్నెకల్ నుంచి అమరావతి రహదారికి రూ.120 కోట్లతో అనుసంధానం చేస్తున్నామని ఆ రహదారి పూర్తయితే ఇల్లెందు వైరా ప్రాంతాల ప్రజలు ఖమ్మం నగరంలోకి రాకుండానే తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతీయ రహదారుల అనుసంధానంతో ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్ తరహా వ్యవస్థ ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా నిధుల కొరతతో సాధ్యం కాలేదని ఇప్పుడు జాతీయ రహదారుల ద్వారానే ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ఈ జాతీయ రహదారి ప్రారంభంతో ఖమ్మం నగరం ట్రాఫిక్ రహితంగా మారుతుందని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ విలువైన భూములను అందించిన రైతులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సహకారం వల్లే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు వేగంగా పూర్తి దశకు చేరుకుందని జిల్లా అభివృద్ధిలో రైతుల సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఒక మంచి రహదారి ఏ గ్రామానికైనా పట్టణానికైనా వంద రెట్లు అభివృద్ధిని తీసుకువస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా చార్జీలు పెంచాలి..

### శంషాబాద్‌లో ఓలా, ఉబర్, స్విగ్గీ డ్రైవర్లు భారీ ధర్నా

గండిపేట(క్రైమ్ మిర్రర్): పెరిగిన డీజిల్, ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా రైడ్, డెలివరీ చార్జీలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ శంషాబాద్ ఫ్లైఓవర్ కింద ఓలా, ఉబర్, స్విగ్గీ సంస్థలకు చెందిన క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ భారీ ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వానికి, ఆయా సంస్థల యాజమాన్యాలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. గత కొంతకాలంగా డీజిల్, పెట్రోల్, వాహన నిర్వహణ ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయని, అయితే కంపెనీలు అందిస్తున్న రైడ్, డెలివరీ చార్జీల్లో ఎలాంటి పెంపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయం కంటే వాహనాల నిర్వహణ, ఇంధన ఖర్చులు, ఈఎంఐలు, కుటుంబ పోషణ ఖర్చులే ఎక్కువగా ఉండటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కంపెనీ యాజమాన్యాలు తమ లాభాలకే ప్రాధాన్యత ఇవ్వకుండా డ్రైవర్లు, డెలివరీ పార్ట్‌నర్ల కష్టాలను గుర్తించాలని కోరారు. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా ప్రయాణ చార్జీలు, డెలివరీ రేట్లను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఓలా, ఉబర్, స్విగ్గీ సంస్థలు డ్రైవర్ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, అత్యవసర సహాయ సేవలు వంటి సంక్షేమ చర్యలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను యాజమాన్యాలు వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా సందర్భంగా శంషాబాద్ ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో కొంతసేపు రద్దీ నెలకొనగా, పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఆందోళన శాంతియుతంగా కొనసాగింది.

## గుంతలు గుంతలు గా మయంగా మారిన శంషాబాద్ రాలగూడ రోడ్డు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ బస్ స్టాప్ నుండి షాబాద్ వెళ్లే రహదారి నిర్మాణం ఆరు నెలలుగా నిలిచిపోవడంతో రాలగూడ రోడ్డు గుంతలు బుడదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు మరోవైపు బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై నెల రోజులుగా ఉంచిన బార్ గేట్ ప్రమాదకంగా మారిందని వీటిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు శంషాబాద్ బస్టాండ్ నుండి షాబాద్ వెళ్లే మార్గంలో ఉన్న రాలగూడ రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాన దారులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు గత ఆరు నెలలుగా రోడ్డు నిర్మాణ పనులు మందకోడిగా సాగుతుండడంతో నిత్యం రాకపోకలు సాధించే ప్రయాణికులు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలకు గుంతలు బురదమయంగా మారిన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు రోడంత పెద్దపెద్ద గుంతలుగా మారి బురదమయంగా తయారయింది. వాహనాలు నడపడానికి వీలు లేకుండా తయారైన ఈ రహదారిపై నిత్యం వాహనదారులు అనంతరాలను ఎదుర్కొంటున్నారు అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**నడిగి రోడ్డుపై బార్ గేట్...** ఇదిలా ఉండగా శంషాబాద్ జాతీయ రహదారిపై ఉన్న బస్టాండ్ సమీపంలో గత నెల రోజులుగా నడిరోడ్డు పై అధికారులు బార్ గేట్ ను ఉంచడం తీవ్ర చర్చ నీయంషంగా మారింది రద్దీగా ఉండే హైవేపై ఇలా బార్ గేట్ ను వదిలివేయడం వల్ల పెద్ద ఎత్తున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. ఈ బార్ గేటు ను వెంటనే తొలగించి వాహనాల రాకపోలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

## జూలై 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండలం కేంద్రంలో ఎస్ఎఫ్ఐ-ఎన్ఎస్యుఐ ల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కె. వై. ప్రణయ్, రచమాల వర్ధన్ మాట్లాడుతూ జూలై 24న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, యువత, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ, ఆ ఘటనలపై నిష్పాక్షికంగా, పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో వరుసగా జరుగుతున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన ఎన్‌టీఏ ను రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధమైన వీబీఎస్ఏ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు జూలై 24న జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థులు, యువజనులు, ప్రజాస్వామ్యవాదులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ప్రసాద్, తరుణ్, రుద్రాక్ష, శివ రాథోడ్,సమీర్, అన్సర్,సుశాంత్, దిక్షీత్, అక్షయ్,తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో ఇండిగో ఉద్యోగినిపై అత్యాచారం ఆరోపణ: క్యాబ్ డ్రైవర్ అరెస్ట్



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేస్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ క్యాబిన్ క్రూ ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో కలకలం రేగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో క్యాబిన్ క్రూ సభ్యురాలిగా పనిచేస్తున్న బాధితురాలిని ప్రతిరోజులాగే క్యాబ్ డ్రైవర్ ప్రశాంత్ కుమార్ విధులకు తీసుకెళ్తున్నాడు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం, ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న సాంటా మారియా స్కూల్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో క్యాబ్‌ను ఆపినట్లు తెలిపారు. అనంతరం క్యాబ్ నుంచి బయటకు దిగిన నిందితుడు, వెనుక సీటులో ఉన్న బాధితురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. బాధితురాలు ప్రతిఘటించడంతో నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఘటన అనంతరం బాధితురాలు వెంటనే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఔట్‌పోస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి నిందితుడు ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా సోమ శ్రీనివాస్‌గుప్త



గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కాటేదాన్ డివిజన్ బాబుల్‌రెడ్డినరగ్ ప్రాంతానికి చెందిన సోమ శ్రీనివాస్‌గుప్త రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైయ్యారు. 2026--28 వరకు పదవీ కాలం కొనసాగనుంది. ఈ రెండు సంవత్సరాల కాలపరిమితిలో మహాసభ అభివృద్ధికి, తన సంఘీయుల అభ్యున్నతికి చేపట్టే అన్ని కార్యక్రమలకు సంపూర్ణ మద్దతు, సహకారం అందించి ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవంను, మహాసభ సభ్యత్వంను పెంపొందించేందుకు కృషి చేస్తానని సోమ శ్రీనివాస్‌గుప్త సూచించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.